
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

కాకినాడ

జిల్లా వార్తలు

శనివారం 8 ఫిబ్రవరి 2025 | 5



ప్రణవ స్వరూపా..లక్ష్మీనరసింహా!





కల్యాణం సందర్భంగా స్వామిని శుక్రవారం ఉదయం నుంచి పలు రకాల వాహనాలపై ఊరేగించారు..



కల్యాణ కాంతులు : విద్యుత్ వెలుగులు మధ్య అంతర్వేది లక్ష్మీ నరసింహుడి ఆలయ ప్రాంగణం



ప్రత్యేక అలంకరణలో నరసింహస్వామి



కల్యాణ క్రతువు

ఆహా ఏమి వైభోగం.. కన్నులారా చూడాల్సిందే.. తరలించాల్సిందే.. శ్రీకర..శుభకర ప్రణవ స్వరూపా లక్ష్మీనరసింహ అంటూ మనసారా కొలవాల్సిందే.. ఇలపై లక్ష్మీనరసింహస్వామి ఉభయ దేవేరులైన భూదేవి, శ్రీదేవిని కల్యాణమాడారు.. శ్రీ వైఖానస ఆగమానుసారం వైష్ణవ సంప్రదాయం ప్రకారం అర్చక బృందం శుక్రవారం దశమి రాత్రి 12:55 గంటలకు మృగశిర నక్షత్రయుక్త వృశ్చికలగ్న మందు స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది.. వైష్ణవ సంప్రదాయబద్ధంగా కల్యాణ క్రతువు నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో సాగిన ఈ కల్యాణ తంతును భక్తులు తన్మయత్వంతో చూసి తరించారు. ఈ కల్యాణం తిలకించేందుకు ఎక్కడెక్కడి నుంచో భక్తజనం తరలివచ్చారు. ఉదయం గ్రామోత్సవం వైభవంగా సాగింది. భక్తజన సందోహంతో అంతర్వేది నిండిపోయింది.. సుమారు నాలుగు గంటల పాటు సాగిన కల్యాణాన్ని భక్తులు ఆద్యంతం వీక్షించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం మధ్యాహ్నం 2.05 గంటలకు స్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

6



అనంత.. దారుణాలైనా రాజాలు!



- హత్యలు చేసినా.. నేతల దర్జా
- కూటమిలోనూ చర్యలు నిల్
- డ్రైవర్ హత్య కేసులో అనంతబాబు
- మధ్యంతర బెయిల్‌పై బయటకు
- విలేకరి హత్య కేసులో రాజా
- ముందస్తు బెయిల్ కొట్టేసిన హైకోర్టు
- అయినా అరెస్ట్ చేయని పోలీసులు
- నవంబరులో కేసు సీఐడీకి అప్పగింత
- అరెస్ట్ చేసే అవకాశం ఉన్నా బేఖాతరు
- శిక్షిస్తామని యువగళంలో లోకేశ్ హామీ
- ఇద్దరు ఏ1లే.. అయినా తేలని కేసులు

వారిద్దరు వైసీపీలో అత్యంత కీలకమైన నేతలు.. జగన్‌కు బాగా సన్నిహితులు.. ఒకరేమో ఎమ్మెల్సీ.. ఇంకొకరేమో మాజీ మంత్రి.. అధికారంలో ఉండగా వీరిద్దరు చెలరేగిపోయారు.. చట్టం చుట్టంగా భావించారు. ఏం జరిగినా వెంట జగన్ ఉన్నారనే ధైర్యంతో ఏకంగా హత్యలకు పథక రచన చేశారు. ప్రస్తుతం ఈ ఇద్దరూ హత్య కేసుల్లో ఏ1 నిందితులే. వీరిలో ఒకరేమో మధ్యంతర బెయిల్‌పై ఇప్పటికీ దర్జాగా బయటే తిరుగుతున్నారు. మరొకరేమో హత్య కేసులో హైకోర్టు తన ముందస్తు బెయిల్ కొట్టేసినా ఏ మాత్రం భయం లేకుండా బయటే స్వేచ్ఛగా తిరుగుతున్నారు. వారిద్దరే.. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కూటమి వచ్చింది..ఇంకేంటి తప్పుడు పనులు చేసిన వైసీపీ నాయకుల పనైపోతుందనుకున్నారంతా.. అయితే సీఎం చంద్రబాబు మాత్రం ఆచితూచి అడుగులు వేస్తున్నారు.. కాకినాడ జిల్లాలోనే చూస్తే ఇద్దరు వైసీపీ ముఖ్య నేతలపై హత్య కేసులు ఉన్నాయి. చాలా ఏళ్లుగా ఈ కేసులు నానుతూనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం రాగానే నాయకుల లెక్క తేలుతుందని అంతా ఆశించారు. అయితే 8 నెలలైనా ఇప్పటి వరకూ చర్యలు కానరాకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇప్పుడిప్పుడే ఒక్కొక్కటిగా కదలిక ఆరంభమైంది. ఎందుకంటే మాజీ మంత్రి దాడిశెట్టి రాజా నిందితుడిగా ఉన్న ఆంధ్రజ్యోతి తొండంగి విలేకరి కాతా సత్యనారాయణ హత్యకేసు విచారణలో సీఐడీ స్పీడు పెంచింది. ఇటీవల కేసును రాజమహేంద్రవరం సీఐడీకి అప్పగించడంతో డీఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం విచారణలో వేగం పెంచింది. ఇప్పటికే సత్యనారాయణ కుటుంబ సభ్యుల వాంగ్మూలాలు నమోదు చేసిన సీఐడీ త్వరలో కేసుకు సంబంధించి మాజీ మంత్రి రాజాను విచారించనుంది. ఈ నేపథ్యంలో పూర్తి ఆధారాలతో కొత్తగా చార్జిషీటు వేయనుంది. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం తొండంగి మండలం ఆంధ్రజ్యోతి విలేకరిగా పనిచేసిన కాతా సత్యనారాయణ 2019 అక్టోబరు15న హత్యకు గురయ్యారు. విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఎస్.అన్నవరంలోని తన ఇంటికి వెళ్తున్న సమయంలో రాత్రివేళ కొందరు అగంతకులు అప్పటి తుని వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్న దాడిశెట్టి రాజా నివాసానికి దగ్గరలో లక్ష్మీదేవి చెరువు గట్టుపై మాటువేసి సత్యనారాయణను హతమార్చారు. ఈ సంఘటన అప్పట్లో సంచలనమైంది. ఈ హత్యకు వైసీపీ నేత దాడిశెట్టి రాజా సూత్రధారి అని మృతుడి కుటుంబీకులు అప్పట్లో ఆరోపించారు. కేసు నమోదైనా అప్పటిలో అరెస్ట్ అవకుండా పోలీసులపై ఒత్తిడి తెచ్చారు. ఈలోపు దాడిశెట్టి రాజాకు మంత్రి పదవి లభించింది. దీంతో కేసు మరింత నీరుగారిపోయింది. 2023లో దాఖలు చేసిన చార్జ్‌షీట్ నుంచి మంత్రిగా ఉన్న దాడిశెట్టి రాజా పేరును పోలీసులు తొలగించారు. అసలు రాజాకు హత్యతో సంబంధం లేదని బుకాయించారు. ఆర్థిక కారణాలతో హత్య జరిగిందంటూ కేసును తప్పుదోవ పట్టించి మమ అనిపించారు. దీనిపై న్యాయవాది అయిన సత్యనారాయణ సోదరుడు గోపాలకృష్ణ హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. రాజా పాత్రకు సంబంధించి ఆధారాలు, పలుసార్లు రాజా అనుచరులు తన సోదరుడిని బెదిరించిన ఘటనలకు సంబంధించిన వివరాలు న్యాయస్థానానికి అందించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు యువగళం పాదయాత్రలో భాగంగా తునికి వచ్చిన నారా లోకేశ్‌ను కలిసి సత్యనారాయణ కుటుంబీకులు తమ ఆవేదన వినిపించారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. దీనిపై లోకేశ్ స్పందించి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనుకున్నట్టుగానే కూటమి ప్రభుత్వం రాగానే పోలీసులు మళ్లీ హత్య కేసును తిరిగి తెరిచారు. మూడు నెలల కిందట తిరిగి దాడిశెట్టి రాజాను పోలీసులు హత్య కేసులో ప్రధాన నిందితుడిగా చేర్చారు. ఈ నేపథ్యంలో అరెస్ట్ తప్పదన్న భయంతో రాజా ముందస్తు బెయిల్‌కు హైకోర్టును ఆశ్రయించారు. అయితే న్యాయస్థానం రాజాకు ముందస్తు బెయిల్ నిరాకరించి పోలీసుల ఎదుట లొంగిపోవాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, వైసీపీ నేత దాడిశెట్టి రాజాను ఏ క్షణమైనా పోలీసులు అరెస్ట్ చేస్తారని అంతా భావించారు. కానీ నెలలు గడుస్తున్నా ఇంత వరకు రాజావైపు అసలు పోలీసులు కన్నెత్తి చూడలేదు. దీంతో రాజా దర్జాగా బయటే తిరుగుతున్నారు. నవంబరులో ఈ కేసును ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. సీఐడీ తొలుత రెండుసార్లు మాత్రమే కేసు విచారణకు తుని వచ్చింది. తాజాగా రాజమహేంద్రవరం నుంచి సీఐడీ డీఎస్పీ ఆధ్వర్యంలో బృందం విచారణ ముమ్మరం చేసింది. లోతుగా దర్యాప్తు చేపట్టింది. సత్యనారాయణ విలేకరిగా ఉన్న సమయంలో రాసిన కథనాలను సేకరించే పనిలో పడింది. వీటన్నింటి లోతుగా శోధించి పూర్తిస్థాయి పక్కా ఆధారాలతో సిద్ధమవుతోంది. ఆ తర్వాత మాజీ మంత్రి రాజాను సైతం విచారించనుంది. అలాగే పక్కా ఆధారాలు అన్నీ చేతికి వచ్చిన తర్వాత అరెస్టులు, కొత్త చార్జిషీటు దాఖలు చేయనుంది.

ప్రభుత్వం మారినా.. ఏ1లు బయటే

చంపేసి.. డోర్ డెలివరీ చేసినా..

ప్రశాంత జిల్లాగా పేరొందిన కాకినాడ 2022 మేలో అట్టుడికిపోయింది. తన వద్ద పనిచేసే దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యంను వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు హత్య చేసి ఆనక మృతదేహాన్ని ఇంటికి డోర్ డెలివరీ చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరొందిన ఎమ్మెల్సీ అనంతబాబు మే 18న రాత్రి కాకినాడలో డ్రైవర్ సుబ్రహ్మణ్యం ఇంటికి వచ్చి పని ఉందని తీసుకువెళ్లాడు. ఆ తర్వాత తెల్లవారుజామున మే 19న మృతదేహాన్ని స్వయంగా తన కారులో అనంతబాబు కాకినాడ కుళాయిచెరువు ఎదురుగా ఉన్న డ్రైవర్ సుబ్రహ్మణ్యం ఇంటికే తీసుకెళ్లినట్టు కేసు నమోదైంది. రోడ్డు ప్రమాదంలో సుబ్రహ్మణ్యం చనిపోయాడని ఆయన తల్లిదండ్రులను నమ్మించే ప్రయత్నం చేశాడు. సుబ్రహ్మణ్యం కుటుంబీకులు తిరగబడడంతో బెదిరింపులకు దిగాడు. ఆగ్రహంతో బాధితులు నిలదీయడంతో కారు వదిలేసి అక్కడి నుంచి అనంతబాబు పారిపోయాడు. ఈకేసులో అనంతబాబును అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. సుదీర్ఘకాలం జైల్లో గడిపిన అనంతబాబు మధ్యంతర బెయిల్‌పై ప్రస్తుతం స్వేచ్ఛగా బయటే తిరుగుతున్నాడు. హత్య కేసు ఆరోపణల కారణంగా అనంతబాబును పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించిన జగన్ ఆ తర్వాత పక్కన పెట్టుకుని బహిరంగ సభలకు హాజరవడంపై అంతా నోరెళ్లబెట్టారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో భాగంగా 2023 డిసెంబరులో పిఠాపురం నియోజకవర్గంలో నిర్వహించిన దళిత సభలో సుబ్రహ్మణ్యం తల్లిదండ్రుల ఆవేదన విని చలించిపోయారు. టీడీపీ అధికారంలోకి రాగానే హత్య కేసును సీబీఐకి అప్పగించి అందరికి శిక్ష పడేలా చేస్తానని పేర్కొన్నారు. తీరా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు దాటినా ఇంతవరకు అనంతబాబుపై ఈగ కూడా వాలలేదు. ఇచ్చిన మాట ప్రకారం లోకేశ్ ఈ కేసుపై ప్రత్యేక దృష్టిసారించాల్సి ఉన్నా ఆ పని చేయడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన కొత్తలో జిల్లా పోలీసుశాఖ సైతం నాటి కేసుల వివరాలు సర్కారుకు పంపినా ఇంకా చలనం లేదు. వాస్తవానికి ఈ హత్యకేసును ప్రభుత్వం లోతుగా పునర్విచారించే అవకాశం ఉన్నా ఆ దిశగా అడుగులు పడడంలేదు. ఈ కేసుపై సీనియర్ న్యాయవాది, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ నిందితుడు, ఆయనకు సహకరించిన అందరూ దర్జాగా తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం ఉనప్పుడు అనంతబాబుపై పోలీసులు వేసిన ఛార్జిషీటులో అనంతబాబుపై అసలు రౌడీషీట్ లేదని పేర్కొన్నారని, ఆ తర్వాత తాము పోరాడితే రౌడీషీట్ ఉందని న్యాయ స్థానానికి తెలిపారన్నారు. ఇప్పటికైనా కేసును లోతుగా విచారించేలా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు.



గో..గో.. గోల్డ్!

- 24 క్యారెట్ తులం రూ.86,510
- 22 క్యారెట్ తులం రూ.79,300
- లక్షకు చేరువలో వెండి ధర

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గోల్డ్ ధర.. గో..గో.. గోల్డ్ అని ఎవరో తరుముతున్నట్టు పరుగులు పెడుతోంది. సామాన్య మధ్యతరగతి ప్రజలకు దడ పుట్టిస్తోంది. 10గ్రాముల ధర రూ.లక్ష అవుతుందేమోననే ప్రచారం జరుగుతోంది. వెండి ధర సైతం పెరుగుతోంది. కిలో వెండి ధర రూ.లక్షకు చేరువగా ఉంది. జనవరి నుంచి ఫిబ్రవరికి కేవలం నెల రోజుల్లో ధరలు భారీగా పెరిగాయి. జనవరి ఒకటో తేదీన 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.71,500గా ఉంది. జనవరి నుంచి గురువారం నాటికి రూ.7,800 పెరిగి 10 గ్రాముల ధర ఏకంగా రూ.79,300కు చేరింది. రెండు రోజులుగా ఇదే ధర కొనసాగుతోంది. ఇదే పెరుగుదల కొనసాగితే 10 గ్రాముల ధర రూ.80 వేలకు చేరవచ్చు. నెమ్మదిగా రూ.లక్షకు చేరుతుందేమోననే అంచనాలున్నాయి. 24 క్యారెట్ 10 గ్రాముల ధర జనవరి 1న రూ.78 వేలుగా ఉంది. గురువారం రూ.86,510కు చేరింది. శుక్రవారం అదే ధర కొనసాగింది. నెల రోజుల్లో రూ.8,500 పెరిగింది. మాఘమాసం పెళ్లిళ్ల సీజన్ కావడంతో ధరల పెరుగుదల అదనపు భారమే.

కేజీ వెండి రూ.98,800

వెండి ధరలు పెరిగిపోతున్నాయి. జనవరి 1న 88,400గా ఉన్న ధర గురువారం నాటికి రూ.99 వేలకు చేరింది. మరో వెయ్యి పెరిగితే కిలో వెండి ధర రూ.లక్షకు చేరుకునేది. కానీ శుక్రవారం రూ.200 తగ్గి 98,800కు చేరింది. జనవరి నుంచి రూ.10,600 పెరిగింది.

పేదలందరికీ ఇళ్ల స్థలాలపై కసరత్తు

- జిల్లాలో 600 ఎకరాల భూమి సేకరించే అవకాశం
- దీనికి రూ.400 కోట్లు కావాలని ప్రతిపాదనలు
- 60 వేల మంది లబ్ధిదారులు ఉంటారని ప్రాథమిక అంచనా
- గత ప్రభుత్వంలో స్థలం పొంది నిర్మాణాలపై ఆసక్తి లేనివారికి కొత్తగా కేటాయింపు
- ప్రైవేటు స్థలాలతోపాటు అసైన్డ్ భూముల సేకరణకు ప్రయత్నాలు

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పేదలందరికీ ఇళ్లస్థలాలు పంపిణీ చేసేందుకు కసరత్తు జరుగుతోంది. దీనికోసం 600 ఎకరాల భూమిని సేకరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. భూసేకరణకు రూ.400 కోట్లు వరకు కావాలని ప్రతిపాదనలను అధికారులు సిద్ధంచేస్తున్నారు. జిల్లాలో 60 వేల మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసే అవకాశం ఉందని ప్రాథమిక అంచనాకు వచ్చారు. గత ప్రభుత్వంలో స్థలం పొంది ఆ స్థలంలో ఇళ్ల నిర్మించడానికి ఆసక్తి చూపని లబ్ధిదారులకు కొత్తగా స్థలం కేటాయించి నిర్మాణాలు చేపడతారు. కాకినాడ జిల్లాలో 21 మండలాల్లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న (బీపీఎల్) పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అర్హులైన నిరుపేదల గృహ నిర్మాణాల కోసం గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల స్థలాన్ని కేటాయిస్తారు. పట్టాపొందిన పదేళ్ల తర్వాత యజమానికి పూర్తి హక్కులు దక్కుతాయి. ఈనేపథ్యంలో కాకినాడ, పెద్దాపురం రెవెన్యూ డివిజన్లలో అధికారులు స్థలాలను గుర్తించే ప్రక్రియ చేపట్టారు. గ్రామీణప్రాంతాల్లో ఏమేరకు ప్రభుత్వ భూములు ఉన్నాయో పరిశీలిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు అందుబాటులో లేకపోతే టిడ్కో గృహాలు కేటాయించాలని సమాలోచనకు చేస్తున్నారు. పైగా అసైన్డ్ గ్రామ కంఠం భూములు ఏమేరకు ఉన్నాయో గుర్తిస్తున్నారు.

గత ప్రభుత్వంలో అరకొర నిర్మాణాలు

వైసీపీ ప్రభుత్వంలో జిల్లాలో 74,237 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పంపిణీ జరిగింది. పట్టణ ప్రాంతాల్లో 60 గజాలు, గ్రామీణ ప్రాంతాల్లో 72 గజాల చొప్పున పంపిణీ చేశారు. దీనిలో కేవలం 28,273 ఇళ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. మరో 24,691 గృహ నిర్మాణాలు వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. 17,935 మంది అసలు గృహాలను నిర్మించలేదు. దీంతో ఆ స్థలాలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఇళ్ల స్థలాలు ఊరికి దూరంగా ఇవ్వడం, తక్కువ లెవెల్‌లో ముంపునకు గురయ్యే స్థలాలు ఇవ్వడం వంటి కారణాలతో లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టలేదు. కాకినాడ నగరంలో పేద లబ్ధిదారులకు యూ.కొత్తపల్లి మండలంలో కొమరిగిరి లేఅవుట్‌లో ఇళ్ల స్థలాలను కేటాయించారు. అయితే కొమరిగిరి లేఅవుట్ కాకినాడకు సుమారు పదిహేను కిలోమీటర్ల దూరం ఉండటంతో చాలామంది లబ్ధిదారులు ఆసక్తి చూపించలేదు. దీంతో అక్కడ నిర్దేశించిన స్థాయిలో నిర్మాణాలు జరగలేదు. అలాగే తుని, ప్రత్తిపాడు వంటి ప్రాంతాల్లో కూడా ఇళ్ల నిర్మాణాలు ఆశించిన స్థాయిలో జరగలేదు. గత ప్రభుత్వంలో స్థలాలు పొంది నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వంలో కొత్తగా స్థలాలు కేటాయించే అవకాశాలు ఉన్నాయి.

నిధుల కేటాయింపు పెరిగింది..

గత ప్రభుత్వంలో ఒక్కొక్క గృహానికి ప్రభుత్వం రూ.1.50 లక్షల చొప్పున నిధులు కేటాయించింది. కూటమి ప్రభుత్వం దీన్ని రూ.2.50 లక్షలకు పెంచింది. పైగా డ్వాక్రా సంఘ సభ్యులకు రూ.35 వేల నుంచి రూ.లక్ష ఇచ్చే దిశగా చర్చలు జరుగుతున్నాయి. దీనికి ఆమోదం లభిస్తే డ్వాక్రా సంఘ సభ్యులకు అదనంగా మరో లక్ష రూపాయల వరకు లభించనుంది.

నిబంధనల ప్రకారం ఇళ్ల స్థలాలు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన లబ్ధిదారులకు స్థలాల పట్టాలు ఇస్తారు. అనంతరం నిర్మాణాలు జరుగుతాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.180 కోట్లతో 8,037 గృహాలను జిల్లాలో నిర్మించాం.

- హౌసింగ్ పీడీ సత్యనారాయణ



ఈ-శ్రమ్ గోడప్రతికను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కార్మికులు ఈ-శ్రమ్‌లో నమోదుచేసుకోవాలి : కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులను ప్రతీ ఒక్కరిని ఈ-శ్రమ్ పోర్టల్‌లో మార్చి 31లోగా నమోదుచేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో ఆయనతో పాటు జేసీ రాహుల్‌మీనాతో కలిసి జిల్లా స్థాయి ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్షేత్రస్థాయి అధికారులు పురపాలక సంఘాల కమిషనర్లు, ఎంపీడీవోలు హాజరయ్యారు. ఈసందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ జిల్లాలో 6 లక్షలకుపైగా అసంఘటిత రంగంలో కార్మికులుగా పనిచేస్తున్నారన్నారు. వారికి సామాజిక భద్రతతోపాటు వివిధ సంక్షేమ పథకాలను అందించేందుకు వారందరినీ ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయవలసి ఉందన్నారు. ఈపథకంలో చేరేందుకు 16 నుంచి 59 సంవత్సరాలలోపు వయస్సు ఉండాలన్నారు. ఆదాయపు పన్ను చెల్లించనివారు, ఎంప్లాయిస్ ప్రావిడెంట్‌ఫండ్, ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్సు సదుపాయం లేనివారు అర్హులన్నారు. ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదైన ప్రతీ కార్మికుడికి ఒక సంవత్సరంపాటు ప్రధానమంత్రి సురక్షబీమా యోజన కింద రూ.2 లక్షల వరకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. వ్యవసాయ అనుబంధ ఉపాధి పనివారు, చిన్న సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, నర్సరీలు, ఉద్యానవనాలు పనివారు, పాడిపరిశ్రమ, ఉమ్మడి వ్యవసాయదారులు, చేనేత కార్మికులు, మత్స్యకారులు, భవననిర్మాణం, అనుబంధ రంగాల్లో పనిచేసేవారు, మధ్యాహ్న భోజన పథకం పనివారు తదితర అసంఘటిత రంగంలో పని చేసే ప్రతీ ఒక్కరూ అర్హులన్నారు. ఈశ్రమ్ పోర్టల్ నమోదుకు అవసరమైన సమాచారంతో దగ్గరగా గ్రామ, వార్డు సచివాలయాలు, కామన్ సర్వీస్ సెంటర్లలో ఉచితంగా నమోదు చేసుకోవచ్చన్నారు. కాగా జిల్లాలో ఎంఎస్ఎంఈ సర్వే పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థితిగతులపై క్షేత్రస్థాయి సర్వేపై ప్రత్యేక దృష్టి పెట్టి వ్యాపారాలు, పరిశ్రమలకు సంబంధించిన వివరాలను ప్రత్యేక ఆప్‌లో సర్వే వివరాలు నమోదు చేయాలని కోరారు.

హాకీ టోర్నమెంట్‌కు అన్ని ఏర్పాట్లు చేయాలి

జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ డీఎస్‌ఏ స్టేడియం వేదికగా జరిగే ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా ఈవెంట్ ఆర్గనైజింగ్ ఉపకమిటీలను కోరారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ నిర్వాహక కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మైదానంలో ఈనెల 15 నుంచి 28వ తేదీ వరకు 14రోజులపాటు జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ నిర్వహణకు ఏర్పాటు చేసిన వివిధ కమిటీలు సమన్వయంతో పనిచేసి ఈవెంట్‌ను విజయవంతం చేయాలన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులకు మధురస్మృతిగా నిలిచేలా అతిథ్యం, సదుపాయాలు కల్పించాలన్నారు. సమావేశంలో ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి, డీఎస్డీవో శ్రీనివాస కుమార్, సీపీవో త్రినాథ్ పాల్గొన్నారు.

కమనీయం.. రమణీయం

లక్ష్మీనరసింహుడి కళ్యాణం

● అంతర్వేది పుణ్యక్షేత్రంలో అంగరంగ వైభవంగా వేడుక

అంతర్వేది, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో అగ్రగామి అయిన అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కల్యాణోత్సవ శోభతో వెల్లివిరిసింది. వేద మంత్రోచ్చారణలతో సకల దేవతల ఆశీర్వచనాలతో శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారు ఉభయ దేవేరులైన భూదేవి, శ్రీదేవిను కల్యాణ మాడారు. శ్రీ వైఖానస ఆగమానుసారం వైష్ణవ సాంప్రదాయం ప్రకారం ఆలయ స్థానాచార్యులు వింజమూరి రామలింగాచార్యులు, ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, వేదపండితులు చింతా వేంకటశాస్త్రి వారి సమక్షంలో అర్చక బృందం పేరూరు ఉద్దండ పండితులు కల్యాణాన్ని నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో సాగిన ఈ కల్యాణ తంతును భక్తులు తన్మయత్వంతో చూసి తరించారు. అంతర్వేదిలో శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణం శుక్రవారం దశమి రాత్రి 12:55 గంటలకు (తెల్లవారితే శనివారం) మృగశిర నక్షత్రయుక్త వృశ్చికలగ్నమందు అంగరంగ వైభవంగా జరిగింది. వైష్ణవ సంప్రదాయబద్ధంగా వేదపండితులు, అర్చక స్వాములు కల్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుభ ముహూర్తానికి జీలకర్ర, బెల్లం స్వామివారి శిరస్సుపై ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల శిరస్సులపై సహాయ అర్చకులు ఉంచారు. ఆలయం ముందు నిర్మించిన శాశ్వత షెడ్లలో భక్తులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఆశీనులై స్వామివారి కల్యాణం వీక్షించారు. ఉభయ రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. సుమారు నాలుగు గంటల పాటు సాగిన కల్యాణాన్ని భక్తులు ఆద్యంతం వీక్షించారు. అనంతరం తెల్లవారుజామున దర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఎదురు చూశారు.



స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

● ఎదురు సన్నాహంతో శ్రీకారం..

రాత్రి 11 గంటలకు ఎదురు సన్నాహంతో కల్యాణ తంతు ప్రారంభమైంది. అనాదిగా వస్తున్న సంప్రదాయం ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరుకు చెందిన ఆలయ ఫౌండర్, ఫ్యామిలీ మెంబరు రాజా కలిదిండి కుమార రామ గోపాలరాజా బహదూర్ శ్రీవారి తరపున, అర్చక స్వాములు అమ్మవారి తరపున వివాహ కర్తలుగా వ్యవహరించారు. ఆలయం నుంచి తొలుత స్వామివారిని తర్వాత అమ్మవార్లను వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అర్చకులు, అధికారులు పల్లకీలో వేర్వేరుగా కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. శ్రీవారు-అమ్మవార్లకు అంతర్వేదికరకు చెందిన డాక్ట ర్ పోతురాజు సూర్యవెంకట సత్యనారాయణ, కుటుంబీకులు గతంలో ఇచ్చిన ఆభరణాలను అర్చకులు అలంకరించారు. కల్యాణం నిర్వహణలో ఆనవాయితీ ప్రకారం పేరూరు వేదపండితులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్వామివారి తలంబ్రాలను పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పొలమూరి కుటుంబీకులు తీసుకువచ్చారు.

● స్వామి, అమ్మవార్లకు మధుపర్కాలు..

కల్యాణానికి ముందు దేవస్థానం తరపున ఆలయ అధికారులు, ప్రభుత్వ ప్రతినిధిగా రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్, మొగల్తూరు రాజావారు ఆలయ ఫౌండర్ రాజా కలిదిండి కుమార రామగోపాల రాజా బహదూర్, కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, జేసీ టి.నిశాంతి, అమలాపురం ఆర్డీవో కె.మాధవి, ఎస్పీ బీ.కృష్ణారావు, ఆలయ అధికారులు, భక్తులు శ్రీస్వామి-అమ్మవార్లకు మధుపర్కాలు సమర్పించారు.

● అద్భుతంగా విద్యుత్ అలంకరణలు..

స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా అంతర్వేది పుణ్యక్షేత్రం విద్యుత్ అలంకరణల నడుమ రంగురంగులతో భక్తులకు కనువిందు చేస్తుంది. భక్తుల రద్దీ ఉన్న ప్రతి ప్రధాన కూడలిలో కల్యాణోత్సవాలను తిలకించేలా పన్నెండు ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటుచేసి గ్రామ పురవీధుల ముఖద్వారాలను సుందరంగా విద్యుత్ కాంతులతో అలంకరించారు.స్వామివారి అంతరాలయం, బేడ మండపం, రాజ్యలక్ష్మీ అమ్మవారి ఆలయం, పశ్చిమ ముఖద్వారం, కల్యాణ మండపద్వారాం, కల్యాణ మండపాలను బెంగుళూరు నుంచి ప్రత్యేకంగా తెప్పించిన పచ్చిపూలతో సుందరాతిసుందరంగా అలంకరించారు. అలాగే కల్యాణ మండపం, ఆలయాలను విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. అయోధ్య, వెంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, పరమశివుడు, నరసింహస్వామి, పాతాలభైరవి, వివిధ సెట్టింగ్‌లతో ఆలయ పుణ్య క్షేత్రమంతా అలంకరించారు.

భక్తజన హారతి

కల్యాణోత్సవాల్లో భాగంగా రథసప్తమి రోజు మొదలుకుని తొమ్మిది రోజుల పాటు వేకువజామున భక్తులు సముద్రస్నానాలు ఆచరించడం ఆనవాయితీ. దీంతో పవిత్ర సాగరసంగమంగా పేరొందిన అంతర్వేది తీరం భక్తులతో కిటకిటలాడుతోంది. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. బ్రహ్మదేవునిచే ప్రతిష్ఠింపబడిన క్షేత్రపాలకుడు నీలకంఠేశ్వరుడుతో పాటు క్షేత్రసంరక్షకుడు ఆంజనేయస్వామి, స్వామి వారి సోదరి గుర్రాలక్కమ్మ, శ్రీ వశిష్ఠ ఆశ్రమ ఆలయాల్లో భక్తులు పూజలు గావించారు. కృష్ణా జిల్లా నుంచి రెండు రోజుల ముందే వచ్చిన భక్తులు కల్యాణ మండపం సమీపంలో నిద్రిస్తూ కల్యాణాన్ని తిలకించారు.





కల్యాణాన్ని తిలకిస్తున్న మంత్రి సుభాష్, కలెక్టర్, ఎస్పీ, తదితరులు



స్వామివారికి బంగారు ఆభరణాలతో అలంకరణ

అంతర్వేది, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా పది సంవత్సరాల నుంచి స్వామివారి పూర్వ నగలను బ్యాంకులో ఉంచి ప్రస్తుతం కొత్త ఆభరణాలతో అలంకరిస్తున్నారు. స్వామివారి కల్యాణ సమయంలో స్వామివారి కుందనపు కిరీటం ధరిస్తారు. వక్షస్థలం, శంఖుచక్రాలు, అనేక బంగారు ఆభరణాలు ధరించే స్వామివారిని దర్శించుకోవడం వల్ల జన్మజన్మల పుణ్యఫలం వస్తుందని పండితులు చెబుతున్నారు. ఈ ఆభరణాలన్నీ వజ్ర వైఢూర్యాలు, మరకత మాణిక్యాలు వంటివి పూర్వకాలంలో మహారాజులు సమర్పించారని చెబుతారు. పూర్వపు ఆభరణాలు శిథిలావస్థకు చేరుకోవడం వల్ల బ్యాంకుల్లో భద్రపరిచారు. అంతర్వేదికర గ్రామంలో ఉన్న అంతర్వేదికి చెందిన దివంగత డాక్టర్ పోతురాజు సూర్యవెంకట సత్యనారాయణ కుటుంబ సభ్యులచే ఉత్సవమూర్తులకు మాత్రం సాదా ఆభరణాలు తయారుచేయించి వాటిని వార్షికంగా ఉత్సవాలకు అలంకరిస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం వాస్తవ్యులు మిరియాల గాంధీ దంపతులు స్వామివారికి బంగారు శతగోపాన్ని, పూణె వాస్తవ్యులు వేంకటేశ్వరా హేచరీసంస్థ నిర్వాహకులు స్వామివారికి బంగారు పంచపాత్రలు, ఉద్దరిణీలు, బిందె, పళ్లెం, బంగారు ఆభరణాలు సమర్పించారు.



కల్యాణోత్సవాల్లో స్వామివారికి అలంకరించిన ఆభరణాలు

పురవీధుల్లో వైభవంగా గ్రామోత్సవం



పంచముఖ ఆంజనేయ స్వామి వాహనంపై స్వామివారి గ్రామోత్సవం

శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు శృంగవరప్పాడు వాస్తవ్యులు రావి సత్యనారాయణమూర్తి, నరసింహస్వామివారిచే నిర్మితమైన పంచముఖ ఆంజనేయస్వామివారి వాహనంపై స్వామివారి గ్రామోత్సవం ఘనంగా జరిపారు. గ్రామపురవీధుల్లో స్వామివారు గ్రామోత్సవం జరగ్గా భక్తులంతా స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారికి హారతులు పట్టి కొబ్బరికాయలు కొట్టారు. అదే విధంగా రాత్రి తొమ్మిది గంటలకు అంతర్వేది పల్లిపాలెం అగ్నికుల క్షత్రియులచే నిర్మితమైన కంచుగరుడ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం ఘనంగా జరిగింది. భక్తులంతా స్వామివారి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని కల్యాణ మండపానికి తీసుకునివెళ్లారు. కార్యక్రమంలో ఆలయ ఫ్యామిలీ ఫౌండర్ రాజాకలిదిండి కుమార రామ గోపాలరాజా బహదూర్, జేసీ నిషాంతి, అమలాపురం ఆర్డీవో కె.మాధవి, డీసీ డీఎల్వీ రమేష్‌బాబు, ఆలయ ఏసీ వి.సత్యనారాయణ, ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, పినిపెట్టి బుజ్జి, గుబ్బల శ్రీను, ఆకన బాబ్జినాయుడు, భైరా నాగరాజు, సర్పంచ్ పోతురాజు నరసింహారావు (కిశోర్), ఎంపీపీ వీరా మల్లిబాబు, వలవల రాంబాబు, పోతురాజు వెంకటకృష్ణ, వనమాలి మూలాస్వామి, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

కొపనాతి కృష్ణమ్మకు భారీ గజమాల

ఆలయానికి అగ్నికుల క్షత్రియులు, కొపనాతి కృష్ణమ్మ వారసులు భారీ ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ విగ్రహానికి భారీ గజమాల సమర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అగ్నికుల క్షత్రియులు, భక్తులు పాల్గొన్నారు. అలాగే ఉత్సవాల్లో సఖినేటిపల్లి, మామిడికుదురు, మలికిపురం మండలాలకు చెందిన సుమారు 200 మందికి పైగా స్కౌట్ విద్యార్థులు పాల్గొని సేవలందించారు. భజరంగదళ్, విశ్వహిందూపరిషత్, సత్యసాయి ట్రస్టు సభ్యులు ఉత్సవాల్లో సేవలు చేసేందుకు ముందుకు వచ్చారు. వైద్యం, తాగునీరు, పారిశుధ్యంపై అధికారులు దృష్టిసారించి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



ఆలయానికి చేరుకున్న గజమాల

● వెంకన్న పట్టు వస్త్రాలు..



పట్టు వస్త్రాలు అందిస్తున్న టీటీడీ సభ్యులు

మాఘమాసంలో దశమిని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి 12.55 గంటలకు జరిగిన స్వామివారి దివ్య తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం, శృంగేరీ పీఠం, అన్నవరం దేవస్థానాలు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ సాంప్రదాయాలతో అర్చకులు, అధికారులు పట్టు వస్త్రాలు తీసుకువచ్చిన సభ్యులకు ఘనస్వాగతం పలికి స్వామివారి దర్శనం అనంతరం పట్టువస్త్రాలను ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, అర్చకులు కల్యాణ మహోత్సవానికి తీసుకువెళ్లారు.

● కల్యాణం టిక్కెట్ రూ.200



స్వామివారి కల్యాణం టిక్కెట్

అంతర్వేది, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ఆరు బయట జరిగే కల్యాణోత్సవాల్లో అంతర్వేది పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి దివ్య తిరు కల్యాణ మహోత్సవం వీక్షించడానికి ఉభయ రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు లక్షలాది మంది తరలివచ్చారు. రెవెన్యూ, దేవదాయ శాఖల ఆధ్వర్యంలో జరిగే స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు ఆలయం వద్దనున్న కౌంటర్‌లో రూ. 200 చొప్పున ఉదయం నుంచి 1500 కల్యాణం టిక్కెట్లను తనిఖీ అధికారి రామలింగేశ్వరరావు విక్రయించారు. సుమారు మూడు వేల మంది కల్యాణాన్ని ప్రత్యక్షంగా తిలకించారు. అలాగే లక్షలాది మంది భక్తులు 12 ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.

● నేడు స్వామివారి రథోత్సవం

స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం భీష్మఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 2.05 గంటలకు ప్రారంభం కానుంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు శుక్రవారం రాత్రికే రథం వద్ద అరటి పండ్లు, గుమ్మడికాయలు, ధాన్యం కుచ్చులను వాహనకారులకు అందజేశారు. వాటితో వాహనకారులు రథాన్ని అలంకరించారు.

ఆకట్టుకున్న విడాకులు కావాలి నాటిక

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణా కళాతోరణ బత్తుల మురళీకృష్ణ కళావేదికపై మార్కండేయ నాటకళాపరిషత్ ఆధ్వర్యంలో తెలుగురాష్ట్రాల నాటిక పోటీలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా రెండోరోజు ప్రదర్శించిన 'విడాకులు కావాలి నాటిక' ప్రేక్షకులను ఆకట్టుకుంది. జీవితంలో దంపతుల మధ్య అభిప్రాయ భేదాలు, చిన్నచిన్న సమస్యలు సహజమేనని, అంతమాత్రాన విడాకులు తీసుకోవడం సమంజసం కాదని చాటిచెప్పడమే ఈ నాటిక సారాంశం. దీన్ని వల్లూరి శివప్రసాద్ రచించగా, గంగోత్రి సాయి దర్శకత్వం వహించారు.



విడాకులు కావాలి నాటికలో సన్నివేశం

● జనరల్ బోగీ కష్టాలు అన్నీఇన్నీ కావు

రైళ్లల్లోని జనరల్ బోగీల్లో ప్రయాణించే ప్రజల కష్టాలను కళ్లకు కట్టినట్టు కొలకలూరి సాయి ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించారు. జనరల్ బోగీలు తగ్గిపోవడం, అందులో ప్రయాణించే వారి వివరాలు రైల్వేశాఖ వద్ద లేక ఏదైనా విపత్తు జరిగినప్పుడు తలెత్తుతున్న పరిణామాలు గురించి తెలియజెప్పారు. కథను పీటీ మాధవన్ రచించగా, గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. దీనిలో భాగంగా కార్యక్రమానికి హాజరైన హైకోర్టు అసిస్టెంట్ రిజిస్ట్రార్ అత్తిన వేణుగోపాలరావును మార్కండేయ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు పడాల రవి, ఇతర ప్రతినిధులు సత్కరించారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

అమలాపురం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని కోర్టుల్లో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు సంబంధించిన కేసులు కూడా లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తారన్నారు. ఉమ్మడి జిల్లాలోని రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తారన్నారు. ప్రధానంగా పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, యాక్సిడెంట్ కేసులు, బ్యాంకు కేసులు, రాజీ పడ దగ్గ క్రిమినల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరిస్తారన్నారు.

కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సునీత కోరారు.

'స్పేసెస్'లో స్పందన యువజనోత్సవాలు



మాట్లాడుతున్న శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయప్రకాష్

తుని రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో స్పందన యువజనోత్సవాలు శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ యూత్ ఫెస్టివల్‌లో విద్యార్థులు ఆటపాటలు, నృత్యాలతో సందడి చేశారు. సంగీతం, సాహిత్యం, నృత్యం, థియేటర్ ఆర్ట్స్, ఫైన్ ఆర్ట్స్, క్రీడల నందు సుమారు 30 అంశాలలో విద్యార్థినీ విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమాన్ని శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయప్రకాష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి, అతిథులు, మోడరేటర్ జి.గ్లోరియా, జూనియర్ లెక్చరర్ ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజ్, హంసవరం, శాంతికపోతాలు ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థి అతిథులతో మోడరేటర్ గ్లోరియా నిర్వహించిన ప్యానల్ డిస్కషన్‌లో కెరియర్‌లో సాఫ్ట్ స్కిల్స్‌పాత్రఅనే అంశంపై విద్యార్థి అతిథులు తమ అభిప్రాయాలను తెలిపారు. విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ ఓటే మాట లేదు ఆడే వాళ్ళకి అనే వేటూరి పాటను ఉదహరిస్తూ నిరంతరం ప్రయత్నించడం ద్వారా గెలుపు సాధ్యమవుతుందని, విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవడానికి స్పందన ఒక వేదిక కాగలదని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ హెచ్ఆర్ వీవీఎస్‌బీ బంగార్రాజు, వైస్ ప్రిన్సిపాల్ పెనుగొండ సుబ్బారావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు జనార్దనుడి రథోత్సవం



ముస్తాబైన ఆలయ పరిసరాలు

ధవళేశ్వరం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ధవళగిరిపై వెలసిన లక్ష్మీజనార్దన స్వామి రథ, కల్యాణోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. తెల్లవారుజాము నుంచే గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తుల కోసం పంచాయతీ ఆధ్వర్యంలో నది ఒడ్డున షవర్లు, మహిళలు దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేక శిబిరాలను అందుబాటులో ఉంచారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ, బ్రాహ్మణ సేవా సంఘం, వివిధ సేవా సంఘాలు, జనసైనికుల ఆధ్వర్యంలో అల్పాహారం, అన్నదానం, పులిహోర, మజ్జిగ, మంచినీరు వితరణకు ఏర్పాట్లు చేశారు. రథోత్సవం సాగే రహదారిపై విద్యుత్ నిలిపివేసి సర్వీస్ వైర్లను తొలగించడం వల్ల రహదారి పొడవునా జనరేటర్ ద్వారా ఫ్లడ్‌లైట్లు వెలిగే విధంగా తీర్చిదిద్దారు. పోలీసుల భారీ బందోస్తుతో రథోత్సవం వేళ ధవళేశ్వరం ప్రధాన రహదారిపై రాకపోకలు నిలిపివేసి ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు.

డెల్టాకు 8,650 క్యూసెక్కుల నీటి విడుదల

ధవళేశ్వరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రబీ పంటల అవసరాల నిమిత్తం కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు 8,650 క్యూసెక్కుల నీటిని అధికారులు శుక్రవారం విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,450, మధ్య డెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 4400 క్యూసెక్కులు చొప్పున జలాలు విడుదలయ్యాయి.

ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 9.85 అడుగులుగా నమోదు కాగా, నీటి లభ్యత 8882 క్యూసెక్కులుగా నమోదయ్యింది.

అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామికి ..

అన్నవరం దేవస్థానం పట్టు వస్త్రాలు

● సమర్పించిన ఈవో సుబ్బారావు దంపతులు



స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఈవో సుబ్బారావు

అన్నవరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దివ్య కల్యాణానికి అన్నవరం దేవస్థానం తరపున ఈవో వీర్ల సుబ్బారావు దంపతులు శుక్రవారం పట్టువస్త్రాలు సమర్పించారు. వీటిని అంతర్వేది ఉత్సవాల అధికారి డీఎల్వీ రమేష్‌బాబు, సహాయ కమిషనర్ సత్యనారాయణకు అందజేశారు. అన్నవరం అధికారులకు వారు స్వాగతం పలికారు. వారి వెంట దేవస్థానం వేదపండితుడు శివ , తదితరులు వున్నారు.

● వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక భోజనశాల

రత్నగిరికి విచ్చేసే వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక భోజనశాలను శుక్రవారం ప్రారంభించారు. ఇప్పటివరకు అందరికీ ఒకే భోజనశాలలో అన్నప్రసాదం వితరణ చేస్తుండగా వృద్ధులు, దివ్యాంగ భక్తుల అవస్థలను చూసి ఈవో వెంటనే ప్రత్యేక శాల ఏర్పాటుచేయాలని ఆదేశించారు.

దీంతో పాత సీఆర్వో కార్యాలయ దిగువ అంతస్తులో హాలును పార్టీషన్ చేయగా పీఆర్వో కృష్ణారావు ప్రారంభించారు. ఒకేసారి 200 మంది భోజనం చేసేలా సౌకర్యం కల్పించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అన్నదాన విభాగ అధికారులు రామకృష్ణ, కంచిబొట్ల రాంబాబు, బండారు రమణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు సిద్ధివినాయకుడి కలముల పంపిణీ

అయినవిల్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీసిద్ధి వినాయకుని సన్నిధిలో స్వామి వారి చెంత ఉంచి పూజించిన కలములను శని, ఆదివారాల్లో భక్తులకు పంపిణీ చేయనున్నట్టు ఆలయ సహాయ కమిషనర్, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. విఘ్నేశ్వరస్వామి వారి చెంత ఉంచి పూజించిన కలములతో పరీక్షలు రాస్తే దిగ్విజయంగా ఉంటుందని భక్తుల విశ్వాసం.



అయినవిల్లిలో పంపిణీకి సిద్ధం చేసిన కలములు

శుభ కార్యానికి వెళుతుండగా రోడ్డు ప్రమాదం

● భార్య మృతి, భర్తకు తీవ్ర గాయాలు



సంఘటనా స్థలంలో ఉన్న రాజేశ్వరిని పరీక్షిస్తున్న 108 సిబ్బంది, గాయపడిన వెంకటేశ్వరరావును ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

రాజానగరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు జాతీయ రహదారి గైట్ కళాశాల సమీపం లో శుక్రవారం రోడ్డుప్రమాదం జరిగింది. దీంతో భార్య అక్కడికక్కడే మృతిచెందగా, భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. తూర్పుగోదావరిజిల్లా రాజ మహేంద్ర వరంరూరల్ బొమ్మూరుకు చెందిన వాకలపూడి రాజేశ్వరి(65), భర్త వెం కటేశ్వర రావు కలిసి మోటార్ సైకిల్‌పై రాజానగరం మండలం పల్లకడియంలో జరిగే ఓ శుభకార్యానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో సరిగ్గా అశోక్ లేల్యాండ్ షోరూమ్ వద్దకు వచ్చేసరికి వీరు ప్రయాణిస్తున్న మోటార్ సైకిల్‌ను లారీ వెనుక నుంచి వచ్చి ఢీకొంది. 108 సిబ్బంది క్షతగాత్రురాలిని పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. కాగా వెంకటేశ్వరావు తలకు, చేతులకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమా దానికి కారణమైన లారీ ఆప కుండా వెళ్లిపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. చివరికి తూర్పుగోనగూడెం సమీపంలో పట్టుకున్నారు. రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ పర్యవేక్షణలో ఎస్ఐ మనోహర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కోటనందూరు, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాకినాడ జిల్లా కోటనందూరు మండలం బొద్దవరం గ్రామానికి చెందిన సుర్ల అప్పలనాయుడు (30) ఈనెల 2వ తేదీ రాత్రి పని ముగించుకుని మోటారుసైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా హెరిటేజ్ పాల డెయిరీ సమీపంలో ప్రమాదానికి గురయ్యాడు. వెంటనే స్థానికులు అతడిని 108 అంబులెన్సులో తుని ఏరియా ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.

ఏలేరు కాలువలో పడి వ్యక్తి మృతి



కిర్లంపూడి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా కిర్లంపూడి మండలం భూపాలపట్నంలో ఒక వ్యక్తి ఏలేరు కాలువలో పడి మృతి చెందాడు. భూపాలపట్నం గ్రామానికి చెందిన వి.రామకృష్ణ (60) పనికి వెళ్లి వస్తుండగా ఏలేరు కాలువ బ్రిడ్జిపై కళ్లు తిరిగికాలువలో పడిపోయి మృతి చెందాడు. ఎస్ఐ సతీష్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

గండేపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామ శివారున శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయాల పాలయ్యారు. తాడేపల్లి నుంచి రాయగడ వెళ్తున్న కారు మల్లేపల్లి గ్రామ శివారుకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో కారు పల్టీలు కొట్టింది. అందులో వున్న దంపతులకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం జగ్గంపేట ఆసుపత్రికి తరలించారు.

నేడు ద్రాక్షారామ భీమేశ్వరుడి దివ్య కళ్యాణం



ద్రాక్షారామ భీమేశ్వరస్వామి



స్వామి కల్యాణ మహోత్సవానికి సిద్ధమవుతున్న వేదిక

● రాత్రి 11.05 గంటలకు సుముహూర్తం ● శోభాయమానంగా భీమేశ్వరాలయం ముస్తాబు



మాణిక్యాంబ అమ్మవారు

ద్రాక్షారామ, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన పురాతన శైవక్షేత్రం, పంచారామం ద్రాక్షారామలో ఉన్నమాణిక్యాంబసమేత భీమేశ్వరస్వామివారి దివ్యకల్యాణం ఫిబ్రవరి 8న శనివారం జరుగుతుంది. స్వయంభువుడు శ్రీభీమేశ్వరస్వామివారు, ద్వాదశ శక్తిపీఠం మాణిక్యాంబ అమ్మవారికి, క్షేత్రపాలకులు శ్రీలక్ష్మీసమేత నారాయణస్వామివారు, శ్రీచండిక సమేత సూరేశ్వరస్వామివార్లకు ఒకే వేదికపై శనివారంరాత్రి ఆరుద్ర నక్షత్ర తులాలగ్నమందు రాత్రి 11.05 నిమిషాలకు ఏకకాలమందు కల్యాణ మహోత్సవం జరుగుతుంది.

లక్ష రుద్రాక్షలతో పూజ

శనివారం ఉదయం 5.45 గంటలకు కల్యాణ మూర్తులను ఆహ్వానిస్తారు. స్వామి కల్యాణమహోత్సవం పురస్కరించుకుని ఉదయం 8.15గంటలకు భీమేశ్వరుడికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరుగుతుంది. అనంతరం వ్యాపారవేత్త సత్తి సుబ్బారెడ్డి దంపతుల సౌజన్యంతో స్వామికి లక్ష రుద్రాక్షలతో పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 3.30గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణం, 6గంటలకు నందివాహనంపై స్వామి నగరోత్సవం జరుగుతుంది. అనంతరం రాత్రి 11.05 గంటలకు పుష్పాలంకృతమైన కల్యాణవేదికపై స్వామివార్ల కల్యాణమహోత్సవం దేవస్థానం బ్రహ్మదేవులపల్లి పణిరామకృష్ణ, అర్చక, వేదపండిత బృందంచే జరుగుతుంది. తిరుమల తిరుపతి దేవస్థానం స్వామి,అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

11న రథోత్సవం, 13న తెప్పోత్సవం

9న గరుడవాహనంపై స్వామివారి నగరోత్సవం జరుగుతుంది. 10న ఉదయం 10గంటలకు స్వామి నగరోత్సవం, రాత్రి 5.45గంటలకు స్వామివార్ల సదస్యం, రాత్రి8.00 గంటలకు సర్వవాహనములపై స్వామివారి నగరోత్సవం జరుగుతుంది. 11న మధ్యాహ్నం 2.55 గంటలకు భీమేశ్వరుడి రథోత్సవం, సాయం త్రం 6.00 గంటలకు వేగాయమ్మపేట ఆస్థాన మండపంలో స్వామివార్ల ఆస్థాన పూజ జరుగుతుంది. 12న ఉదయం 7.55గంటలకు స్వా మి వసంతోత్సవం, నాకబలి, తదుపరి త్రిశూ ల, శ్రీ చక్రస్నానం జరుపుతారు. 13న రాత్రి 6.35 గంటలకు సప్తగోదావరినదిలో స్వామివా రి తెప్పోత్సవం నిర్వహిస్తారు. 14న రాత్రి 7.05లకు స్వామివారి శ్రీపుష్పోత్సవం జరుగుతుంది.

శోభాయమానంగా కల్యాణ వేదిక

భీమేశ్వరస్వామి కల్యాణమహోత్సవాలు పురస్కరించుకుని ఆలయంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయ అంతర ప్రాంగణంలో శోభాయమానంగా కల్యాణ వేదికను భారీగా తీర్చిదిద్దారు. స్వామి కల్యాణం వేలాది మంది తిలకించేందుకు ప్రత్యేకంగా పందిర్లు ఏర్పాటుచేశారు. ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణ చేశారు. కల్యాణ మహోత్సవం తిలకించేందుకు వచ్చిన భక్తులకు స్వామి తీర్థప్రసాదాలతోపాటు, స్వామివారి కల్యాణ ముత్యాల తలంబ్రాలు అందజేస్తామని ఆలయ ఈవో, సహాయకమిషనర్ అల్లు వెంకట దుర్గా భవానీ తెలిపారు.



రాష్ట్ర యూత్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించే పిఠాపురంలోని బాస్కెట్‌బాల్ క్రీడామైదానం

నేటి నుంచి రాష్ట్ర యూత్ బాస్కెట్‌బాల్ పోటీలు

● పిఠాపురంలో నాలుగురోజులపాటు నిర్వహణ

పిఠాపురం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాతబస్టాండు వద్దగల మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం నుంచి మాజీ మంత్రి కొప్పన మోహరావు, రమాదేవి స్మారక 8వరాష్ట్ర యూత్ బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు జరుగనున్నాయి. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్, ఇన్ తూర్పుగోదావరి జిల్లా, పిఠాపురం బాస్కెట్‌బాల్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ వరకూ డే అండ్‌నైట్ పద్ధతిలో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాలు నుంచి బాలబాలికల జట్లు పాల్గొననున్నాయని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు(అయలు) తెలిపారు. పిఠాపురంలో బాస్కెట్‌బాల్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్ నిర్వహించనున్న నేపథ్యంలో మునిసిపల్ పాఠశాల ఆవరణలోని బాస్కెట్‌బాల్ క్రీడా మైదానాన్ని సిద్ధం చేశారు. పోటీలకు తరలివచ్చే క్రీడాకారులకు వసతి ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ముగిసిన ఆలిండియా లాన్ టెన్నిస్ పోటీలు

● బాలురలో ఏపీ, బాలికల్లో తెలంగాణ విజేతలు

కాకినాడఅర్బన్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): మూడురోజులుగా కాకినాడజిల్లా క్రీడామైదానంలో జరుగుతున్న అండర్-16 లాన్ టెన్నిస్ పోటీలు శుక్రవారం ముగిశాయి. బాలుర విభాగం సింగిల్స్‌లో ధ్రువ్ (తమిళనాడు)పై విన్సెంట్ (ఏపీ)5-77-6 స్కోరుతో గెలుపొందాడు. బాలికల విభాగంలో జోహా(తెలంగాణ)పై గౌరిశ్రీ (తెలంగాణ)6-2,6-2 స్కోరుతో గెలుపొందారు. బాలికల డబుల్స్ విభాగంలో జోహా, సవర్ణికలపై జోషిత, సుమేరా 6-2, 6-4 స్కోరు తో విజయం సాధించారు. బాలుర డబుల్స్ విభాగంలో విన్సెంట్, తనీష్‌లపై ప్రమోద్, భవేష్‌లు 6-3, 4-6, 10-6 స్కోరుతో విజ యం సాధించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్ పాల్గొని విజేతలకు షీల్డులు, పతకాలు అంద జేశారు. లాన్ టెన్నిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బీవీ రామ్‌కుమార్, డాక్టర్ గిరి, హెచ్ఎస్ శర్మ, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



ఆలిండియా అండర్ 16 లాన్ టెన్నిస్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

కమాండెంట్‌గా నాగేంద్రరావు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ముద్రగడ నాగేంద్రరావు

సర్పవరంజంక్షన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : కాకినాడ రమణయ్యపేట ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా ముద్రగడ నాగేంద్రకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ అడిషనల్ కమాండెంట్‌గా విధులు నిర్వహించానని, తిరిగి కమాండెంట్‌గా రావడం ఆ నందంగా ఉందన్నారు. సిబ్బంది సంక్షేమంకోసం తనవంతు సహకారం అందిస్తానన్నారు. అడిషనల్ కమాండెంట్ ఎస్.దేవానందరావు మొక్క అందించి నాగేంద్రరావుకు స్వాగతం పలికారు. అనంతరం హెచ్ఏసీ కమాండెంట్ సీపీఏ రామకృష్ణ నుంచి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు టీఎస్ చంద్రశేఖర్, బి.శ్రీనివాస్‌బాబ్జి, ఆర్ఐలు విఠలేశ్వర రావు, రవిశంకర్, అజయ్‌కుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.



క్యూలైన్లు పరిశీలిస్తున్న ఈవో, అధికారులు, వసతి సరిపడక ఆలయ ప్రాంగణంలో విశ్రమిస్తున్న భక్తులు

భీష్మ ఏకాదశి దర్శనంకోసం పోటెత్తిన భక్తులు

● వసతులు దొరక్క భక్తుల అవస్థలు

అన్నవరం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): శనివారం భీష్మ ఏకాదశి పర్వదినాన సత్యదేవుడి దర్శనానికి శుక్రవారం రాత్రికే భక్తులు వేలాదిగా చేరుకున్నారు. భక్తులకు వసతి సరిపడక అవస్థలు ఎదుర్కొన్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత డార్మెటరీలు ఏర్పాటుచేశారు. శనివారం భక్తులు అధికసంఖ్యలో రానుండటంతో ఒంటిగంట నుంచి వ్రతాలు సర్వదర్శనాలను ప్రారంభించాలని సర్క్యులర్ జారీచేశారు. వ్రతాలు, దర్శనాలకు సంబంధించి భక్తులకు ఎక్కడా అసౌకర్యం లేకుండా అధికారులు ప్రత్యేకచర్యలు చేపట్టారు. పశ్చిమరాజగోపురంవద్ద హోల్డింగ్‌పాయింట్లను ఏర్పాటు చేశారు. ఆలయంలోపల వ్రతమండపాల ఖాళీనిబట్టి భక్తులను లోపలకి అనుమతించాలని నిర్ణయించారు. త్రాగునీటి ఇబ్బందులు కలగకుండా ఎక్కడికక్కడ వాటర్‌పాయింట్లు, సేవా సంస్థ సభ్యుల ద్వారా త్రాగునీటి సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకున్నారు. ఏర్పాట్లను శుక్రవారం ఈవో వీర్ల సుబ్బారావు సిబ్బందితో పరిశీలించారు. శనివారం సుమారు 15 వేల వ్రతాలు జరిగి 80 వేలమంది భక్తులు విచ్చేస్తారని అంచణా వేస్తూ ఏర్పాట్లుచేశారు.

ఆర్చ్ బ్రిడ్జిపై స్లీపర్ల మార్పు

» గంటకు 130 కి.మీ. స్పీడు సామర్థ్యం

» 1997లో వేసిన సిమెంటు దిమ్మలకు మోక్షం



ఆర్చ్ బ్రిడ్జిపై స్లీపర్లు మారుస్తున్న టీఆర్టీ యంత్రం

రాజమహేంద్రవరం,ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): ఆర్చ్ బ్రిడ్జి రైల్వేట్రాక్ సేఫ్టీ మరమ్మతులు పూర్తయ్యాయని విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్ఎం) నరేంద్ర ఎ.పాటిల్ పేర్కొన్నారు. చెన్నై-హౌరా సెక్షన్‌లో ఈబ్రిడ్జి ముఖ్యమైనదని తెలిపారు. ట్రాక్ రెనివల్ ట్రైన్(టీఆర్టీ) యంత్రాన్ని వినియోగించి అత్యంత వేగంగా పనులు పూర్తిచేశామన్నారు. కీలకమైన పనులను ఎంతో శ్రమించి పూర్తిచేసిన స్థానిక రైల్వే ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. కాగా.. ఆసియాలోనే పేరు గాంచిన ఆర్చ్ బ్రిడ్జిని 1997లో నిర్మించారు. అప్పటి అవసరాలకు అనుగుణంగా ట్రాక్ నిర్మాణం జరిగింది. తర్వాత రోజుల్లో రైల్వే ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. కానీ 28ఏళ్ల క్రితంవేసిన స్లీపర్లే ఉన్నాయి. ప్రస్తుతం ప్రతిరోజూ 86 రైళ్లు ఈ బ్రిడ్జిపై రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో పట్టాల కింద ఉండే స్లీపర్లు(సిమెంటు దిమ్మలు) పాడయ్యాయి. 338 స్లీపర్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. సేఫ్టీ పనుల్లో భాగంగా వీటితోపాటు ఈ బ్రిడ్జి మొత్తం నిడివి 2.73కిలోమీటర్లలో స్లీపర్లు మార్చాలని నిర్ణయించారు. దీనికి ప్రత్యేకంగా టీఆర్టీ యంత్రాన్ని వినియోగించారు. మొత్తం 4,856 స్లీపర్లను మార్పుచేశారు. సాధారణంగా మనుషులతో అయితే 10స్లీపర్లు వేయడానికి సుమారు 10రోజులు పడుతుంది. ఈ య ంత్రం నిమిషానికి 9స్లీపర్లను వేసేస్తుంది. దీంతో అతి తక్కువ సమయంలో పనులు పూర్తిచే శారు. పాత స్లీపరు బరువు 280 కిలోలు కాగా ఇప్పుడు 350కిలోల బరువు కలిగిన స్లీపర్లు వేశారు. ఇవి 25-32 యాక్సిల్ లోడ్‌ని కూడా తట్టుకోగలవు. ఈ స్లీపర్లు వేసినచోట రైలు గరిష్ఠంగా గంటకు 160 కిలోమీటర్ల స్పీడుతో పరుగులు పెట్టవచ్చు. ప్రస్తుతం చాలాచోట్ల గంటకు 130 కిలోమీటర్ల వేగాన్ని అనుమతిస్తున్నా.. బ్రిడ్జి కావడంవల్ల దీనిపై గంటకు గరిష్ఠంగా 80 కిలోమీటర్ల స్పీడు వరకూ అనుమతించనున్నారు.

బాలికలపై అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడి సస్పెన్షన్

● తమకు అప్పగించాలని తల్లిదండ్రుల ఆగ్రహం



ఉపాధ్యాయుడు సుధీర్‌ను సస్పెండ్ చేసినట్టు ప్రకటించిన ఎంఈవోలు

కొత్తపల్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో పాఠాలు చెబుతూ బాలికలపట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిని తమకు అప్పగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళన చేపట్టిన సంఘటన కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం కేఎస్ఈజెడ్ కాలనీ ప్రాథమిక పాఠశాల వద్ద శుక్రవారం జరిగింది. కేఎస్ఈజెడ్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నడికి సుధీర్ ఐదో తరగతి విద్యార్థినిలకు పాఠాలు చెబుతూ అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు సెల్‌ఫోన్‌లో అశ్లీల చిత్రాలు చూపిస్తూ వేధించేవాడు. అక్కడితో ఆగకుండా బాలికలు చెప్పుకోలేని విధంగా తాకడం వంటి వికృత చేష్టలు చేయడం వంటివి చేయడంతో బాలికలు వారి తల్లిదండ్రులతో చెప్పుకొని రోధించడంతో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఏవీ శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే ఆ ఉపాధ్యాయుడిని తక్షణం అప్పగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్రస్థాయిలో ఆందోళన చేపట్టారు. పరిస్థితిని గమనించిన ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు మండల విద్యాశాఖాధికారులు బుర్రా వేణుగోపాల్, పైడి రాజులకు విషయం తెలియజేశారు. ఇదే విషయాన్ని జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేశా రు. దీంతో డీఈవో ఉపాధ్యాయుడు సుధీర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యాయుడిని సెస్పెండ్ చేసినట్లు ఎంఈవోలు ప్రకటించారు. ఉపాధ్యాయుడు సుధీర్‌ను తమకు అప్పగించాలని తల్లిదండ్రులు అధికారులను డిమాండ్ చేశారు. విద్యాశాఖాధికారులు వేణుగోపాల్, పైడిరాజు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తల్లిదండ్రులకు ఇటువంటి సంఘటనలు పునరావృతంకావని నచ్చచెప్పారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

● అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



అమలాపురం టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అమలాపురం శివారు కంసాల కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్న నరెళ్ల కవిత (31) శుక్రవారం మధ్యాహ్నం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె భర్త సునీల్ పశ్చిమగోదావరిజిల్లా నర్సాపురంలో జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఒక పాప, బాబు ఉన్నారు. చిన్నారులు ఇద్దరూ పాఠశాలకు వెళ్లిన తరువాత కవిత ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని మృతి చెందింది. వారి కుటుంబానికి సన్నిహితుడైన దూనబోయిన పెద్దిబాబు తలుపులు పగులగొట్టి చూసేసరికి కవిత మృతి చెందినట్లు గుర్తించారు. వెంటనే పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కవిత స్వగ్రామమైన అల్లవరం మండలం గూడాల కాగా ఆమె తండ్రి జట్టు కూలీగా పనిచేస్తున్న సమయం నుంచి పెద్దిబాబు ఆ కుటుంబానికి సన్నిహితుడిగా మెలుగుతున్నాడు. మృతురాలి భర్త సునీల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ వీరబాబు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి శవ పంచనామా పూర్తిచేశారు. అనంతరం మృతదేహాన్ని అమలాపురం ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

360 కిలోల గంజాయి స్వాధీనం



పట్టుకున్న గంజాయిని మీడియా ముందు ప్రవేశపెట్టిన పోలీసులు

గండేపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి జాతీయ రహదారి మీదుగా తరలిపోతున్న 360 కిలోల గంజాయిని గండేపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గండేపల్లి పోలీస్‌స్టేషన్‌వద్ద శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్, గండేపల్లి ఎస్ఐ యూవీ శివనాగబాబు వివరాలను వెల్లడిం చారు. కాకినాడజిల్లా ఎస్పీ బిందుమాధవ్‌కు వచ్చిన సమాచారం మేరకు గురువారం మధ్యాహ్నం గండేపల్లి జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా ఎన్టీ రాజాపురంవద్ద కంటైనర్‌లో గంజా యి తరలిస్తుండడాన్ని గుర్తించారు. 18 బస్తాల్లో 360 కిలోల గంజాయి, కంటైనర్, స్విఫ్ట్ కారు, హోండా మోటార్ సైకిల్, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కేరళకు చెందిన సాబు చూతం పరంబిల్ దేవాస్సిను అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి, సొత్తు విలువ రూ.26,79,750 ఉంటుంది. గంజాయిని ఏజెన్సీ నుంచి కేరళకు తరలిస్తున్నారు. పరారీలో ఉన్న వ్యక్తుల కోసం ప్రత్యేక బృందాలను పంపించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ కేసులో చురుగ్గా వ్యవహరించిన గండేపల్లి ఎస్ఐ యూవీ శివనాగబాబు, సిబ్బంది ఖాజా, గిరిబాబులను ఎస్పీ బిందుమాధవ్, పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు, జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్ అభినందించారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి

తునిరూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రైలులో పయనిస్తూ వ్యక్తి మృతి చెందిన ఘటన తుని రైల్వేస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కాకినాడజిల్లా తుని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.... లోకమాన్య తిలక్ సూపర్‌ఫాస్ట్ రైలు ముంబై నుంచి విశాఖపట్నం వెళుతుండగా రైలులో ప్రయాణిస్తున్న సుమారు 47ఏళ్ల వయస్సు గల వ్యక్తి అస్వస్థతకు గురవడంతో తుని రైల్వేస్టేషన్లో అత్యవసరంగా రైలు నిలిపారు. సంబంధిత వక్తిని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయినప్పటికీ మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసిన రైల్వేపోలీసులు మృతుడి వివరాల కోసం ఆరా తీయగా మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లేనట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుడి చెయ్యిపై పువ్వు మొక్క పచ్చబొట్టు, చొక్కా నీలం రంగు, ట్రాక్ ధరించి ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచినట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

తాగునీటి కాలుష్యంపై తిరుపతి ఐఐటీ బృందం తనిఖీ



తనిఖీలు చేస్తున్న తిరుపతి ఐఐటీ కళాశాల నుంచి వచ్చిన పర్యావరణ ఇంజనీర్లు

సామర్లకోట, ఫిబ్రవరి 7: (ఆంధ్రజ్యోతి): కా కినాడజిల్లా సామర్లకోట మున్సిపాల్టీ పట్టణ ప్ర జలకు కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న తా గునీరు ఇటీవల కలుషితం అవుతుందన్న ప లువురి ఆరోపణల మేరకు తిరుపతికి చెందిన ఐఐటీ ప్రొఫెసర్ల బృందం శుక్రవారం సామర్లకోటకు చేరుకుని ఫిల్టర్‌వాటర్ స్కీంను, తా గునీటి సరఫరా విధానాలను పరిశీలించారు. మున్సిపల్ డీఈ శశిధర్, ఏఈ శ్రీనివాసు తదితర వాటర్‌వర్క్స్ సిబ్బంది వీరి వెంట ఉన్నారు. ఇప్పటికే తాడేపల్లిగూడెంనకు చెందిన నిట్ జా తీయ యూనివర్శిటీ ప్రొఫెసర్ల బృందం తనిఖీలు నిర్వహించి నీటి నమూనాలు విశ్లేషణ నిమి త్తం తమ వెంట తీసుకువెళ్లిన విషయం విధిత మే. తాజాగా శుక్రవారం మరో ప్రొఫెసర్ల బృం దం నీటి నమూనాలు సేకరించి విశ్లేషణ నిమి త్తం తమవెంట తీసుకువెళ్ళారు. ఈ బృందంలో పర్యావరణ ఇంజనీర్లు డాక్టర్ నిప్ప ట్లపల్లి నర్సమ్మ, డాక్టర్ పుట్టంరెడ్డి శివసాయి, అవినాష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడి మృతి



సత్యనారాయణ(ఫైల్)

జీజీహెచ్ (కాకినాడ), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్థానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి అనంతరం కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ రూరల్ మండలం, వెలమల తూరంగికి చెందిన మడ్డు వీర వెంకట సత్యనారాయణ (24)కు తల్లి అర్జునమ్మ, సోదరి ఉన్నారు. కాగా ఆయువకుడు అవివాహితుడు. అతను గత నాలుగేళ్ళుగా కాకినాడ జీజీహెచ్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. అయితే ఆ యువకుడు గత కొంతకాలంగా వన్‌సైడ్ లవ్‌లో ఉన్నాడు. ఈ క్రమంలో అతని ప్రేమ విఫలం కావడంతో తీవ్ర మనస్తాపానికి గురైయ్యాడు. ఈ నేపధ్యంలో ఇటీవల అతను శీతలపానీయంలో గడ్డి మందు కలుపుకుని తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్ర అస్వస్థతకుగురైన ఆ యువకుడుని కు టుంబీకులు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఇంద్రపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై పోలీసులు జిల్లావ్యాప్తంగా శుక్రవారం రాత్రి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ముఖ్య కూడళ్లలో శుక్రవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు ప్రత్యేక బృందాలతో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేశారు. మొత్తం 53 కేసులు నమోదు చేశారు.

'కూటమి అభ్యర్థిని గెలిపించండి'



కాకినాడలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల సమస్యల పట్ల అవగాహన గల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పట్టభద్రులను కోరారు. కాకినాడ బార్ అసోసియేషన్‌లో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కొండబాబు, ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ న్యాయవాదులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో కాకినాడ బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఒక్కో కార్యకర్త 30 మంది పట్టభద్రుల ఓటర్లను కలవాలని, కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. కాకినాడ జిల్లా టీడీపీ కార్యాలయంలో సిటీ నియోజకర్గ పరిధిలోని సర్కిల్ క్లస్టర్లు, ఎమ్మెల్సీ వార్డుల ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి కొండబాబు అధ్యక్షత వహించి మాట్లాడారు. అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతీ ఓటర్‌ను కలిసి తనకు ఓటు వేసేలా ప్రచారం సాగించాలని కోరారు. సమావేశంలో టీడీపీ నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, మాజీ కార్పొరేటర్లు వొమ్మి బాలాజీ, పలివెల రవి, తుమ్మల సునీత, నాయకులు గదుల సాయిబాబు, బుచ్చ శేఖర్, సీకోటి అప్పలకొండ, నల్లారి శ్రీనివాస్, అంబటి చిన్న, అమలకంటి బలరామ్, రెడ్నం సత్తిబాబు, పాలిక నాని, చోడిపల్లి సతీష్, మూగు రాజు, గాది శివ, లూటుకుర్తి మోహన్ పాల్గొన్నారు.

పిఠాపురం రూరల్/గొల్లప్రోలు రూరల్: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను రికార్డుస్థాయి మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ కోరారు. పిఠాపురం మండలం విరవాడ, కోలంక, గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామాల్లో వారు పర్యటించి పట్టభద్రుల ఓటర్లు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులను కలిసి కూటమి అభ్యర్థికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ, కూటమి నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, సకుమళ్ల గంగాధర్, కోలా రాజు, చిన్న, కందా శేషగిరి, రాంబాబు, ఎలుబండి బాబులు, మడికి ప్రసాద్, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: గ్రాడ్యుయేట్ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా రమణయ్యపేటలో ఎంపీడీవో, తహశీల్దార్, పోలీస్‌స్టేషన్లు, హైస్కూల్స్ పరిసర ప్రాంతాల్లో టీడీపీ నియోజకవర్గ ఎన్నికల సమన్వయ కర్త, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

వేట్లపాలెంలో ఘనంగా వెంకన్న కల్యాణోత్సవాలు

సామర్లకోట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం వేట్లపాలెం వేంకటేశ్వర స్వామి వారి దివ్యకల్యాణోత్సవాలు పురస్కరించుకుని శుక్రవారం ఆలయంలో ఘనంగా పూజలు ప్రారంభించారు. ఆలయ వ్యవస్థాపకులు పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో స్వామి, అమ్మవార్లను నూతన వధూవరులుగా అలంకరించి శేష వాహనంపై ప్రతిష్ఠించి పురవీధుల మీదుగా గ్రామోత్సవం బ్యాండుమేళాలు, బాణాసంచా కాల్పుల మధ్య నిర్వహించారు. గ్రామస్తులు స్వామిని దర్శించి మొక్కుబడులు తీర్చుకున్నారు. గోలి సోమేశ్వరరావు, గుమ్మళ్ళ సత్యనారాయణ, గుమ్మళ్ళ రాజు, నున్న నారాయణ రావు పాల్గొన్నారు. శనివారం భీష్మఏకాదశి మహా పర్వదినం సందర్భంగా ఉదయం గోపూజ, 108 దంపతులచే లక్షపుష్పాలతో విశేష పూజలు నిర్వహించనున్నట్లు నాగేశ్వరరావు మాస్టారు తెలిపారు. ఆలయం ఆవరణలో భీష్మ ఏకాదశి మహాపర్వదినం సందర్భంగా జిల్లా స్థాయి పురుషుల, మహిళల భజనపోటీలు పెద్దఎత్తున నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. 2 విభాగాలుగా నిర్వహించే పోటీలు ఈ నెల 9 నుంచి 11 వరకూ నిర్వహిస్తామన్నారు. 9న ఆలయ ఆవరణలోగల రైస్‌మిల్లులో మహాఅన్నదానం నిర్వహిస్తామన్నారు. 10న స్వామివారి, అమ్మవారి సదస్యం, 12న బుధవారం శ్రీచక్ర స్నానం-పూర్ణాహుతి, రాత్రి 8 గంటలకు శ్రీపుష్పయాగోత్సవం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే రాజప్ప విశేష పూజలు

భీష్మ ఏకాదశి ప్రారంభంలో భాగంగా ఏపీ నగరంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం జరిగిన విశేష పూజల్లో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. వేంకటేశ్వరస్వామికి విశేష పుష్పార్చన పూజలు చేశారు. పండితులచే వేదాశీర్వచనంతో తీర్థ ప్రసాదాలను రాజప్ప స్వీకరించారు. తెలుగు రైతు కాకినాడ పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ పాలకుర్తి శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని రక్షించాలి



ప్రసంగిస్తున్న శివాజీ

పెద్దాపురం (సామర్లకోట), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిని మనం రక్షిస్తే ప్రకృతి మనల్ని రక్షిస్తుందని తిరుపతికి చెందిన ప్రముఖ పర్యావరణవేత్త, ప్రకృతి ప్రేమికులు, తిరుపతి నగరంలో ప్లాస్టిక్ వినియోగాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమాలు సాగిస్తున్న పాలేటి శివాజీ విద్యార్థులకు పిలుపునిచ్చారు. పెద్దాపురం శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శివాజీ మాట్లాడుతూ ఒక్కసారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్, పాలిథిన్‌లపై ప్రతీ ఒక్కరూ అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించే అవకాశాలు ప్రతీ విద్యార్థి నుంచి ప్రాథమికంగా ప్రారంభమవ్వాలన్నారు. కార్యక్రమంలో శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాల కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలను సద్వినియోగం చేసుకోండి

కరప, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 10వ తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని పంపిణీ చేసే ఆల్బెండజోల్ మాత్రలను ప్రతీఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, కరప, వేళంగి పీహెచ్‌సీ వైద్యాధికారులు ఏంజెలినా, ఎంకే సౌజన్య సూచించారు. కరప చంద్రన్న సమావేశ మందిరంలో శుక్రవారం వైద్యఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, మండల విద్యాశాఖ అధికారులు, సిబ్బందితో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు ఈ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. నులిపురుగుల వల్ల కలిగే అనర్థాలు, వాటి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అందరూ సమష్టిగా ముందుకు వచ్చి 1-19ఏళ్ల లోపు పిల్లలు, కిశోర బాలలతో ఈ మాత్రలను మింగించాలన్నారు. ఆయా పాఠశాలలు, అంగన్‌వాడీకేంద్రాలు, కళాశాలల్లో విద్యార్థులందరూ ఈ మాత్రలను వేసుకుని నులిపురుగల నుంచి రక్షణ పొందాలన్నారు. ఎంఈవో కొప్పుల బులికృష్ణవేణి, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు,వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

పీహెచ్‌సీకి వైద్య పరికరాలు



పరికరాలను ప్రారంభిస్తున్న పీవీటీఎల్ సీఎఫ్‌వో జితేంద్ర, డాక్టర్ వసుంధరా దేవి

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం తూరంగి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి పవర్ గ్రిడ్ వైజాగ్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ వారు సీఎస్ఆర్ నుంచి రూ.40లక్షల విలువైన వైద్య పరికరాలను అందజేశారు. పీవీటీఎల్ సీఎఫ్‌వో జితేంద్ర ప్రజాపతి, వైద్యాధికారిణి డాక్టర్ వసుంధరా దేవి, మేనేజర్ కోటేశ్వరరావు ప్రారంభించారు. ఎంపీహెచ్‌ఈవో పీవీ ప్రకాశరావు, హెచ్‌ఎల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

కొత్తపల్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలో పొన్నాడ శివారు కోనపాపపేటకు చెందిన సుమారు 20 మంది మత్స్యకారులు భారతీయ జనతా పార్టీలో చేరారు. కోనపాపపేటకు చెందిన కొర్ని గోపి, కొర్ని తాతారావు ఆధ్వర్యంలో చేరిన మత్స్యకారులకు జిల్లా బీజేపీ అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు బీజేపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కొత్తపల్లి మండలాధ్యక్షుడు పంపన శేషు, మాజీ జిల్లా అధ్యక్షులు యెనిమిరెడ్డి మాలకొండయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి డీవీఎస్‌రాజు, జిల్లా నాయకులు బిళ్ళకుర్తి రామేశ్వరరెడ్డి, బుర్రా కృష్ణంరాజు, రవణం సుబ్రహ్మణ్యం, వాసంశెట్టి శ్రీనివాసరావు ఉన్నారు.

గుండెపోటుతో కల్లుగీత కార్మికుడి మృతి

కరప, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కరప శివారు రామకంచిరాజునగర్‌కాలనీలో గురువారం రాత్రి గుండెపోటుతో కల్లుగీత కార్మికుడు మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు..కరప గ్రామానికి చెందిన పెంకే శ్రీనివాస్(43) కల్లుగీత కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజులాగే గురువారం సాయంత్రం రామకంచిరాజునగర్‌కాలనీలో తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా గుండెపోటుకు గురయ్యాడు. ఎవరూ గమనించకపోవడంతో తాటిచెట్టుపైనే తుది శ్వాస విడిచి చెట్టుకు వేలాడుతూ ఉండిపోయాడు. కొద్దిసేపటి తరువాత స్థానికులు గుమికూడి మృతదేహాన్ని కిందికి దించారు. అయితే అప్పటికే మృతిచెందినట్టు స్థానిక వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీనివాస్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్టు బంధువులు తెలిపారు.

మల్లవరం రహదారి పనులు ప్రారంభం

● తీరనున్న ప్రజల కష్టాలు ● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



గొల్లప్రోలు మండలం చేబ్రోలు-మల్లవరం మధ్య ఆర్అండ్‌బీ రహదారిని నిర్మిస్తున్న దృశ్యం

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మల్లవరం ఆర్అండ్‌బీ రహదారి పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. గొల్లప్రోలు మండలం చేబ్రోలు నుంచి మల్లవరం, ఏపీ నగరం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి గోతులతో అధ్వానంగా మారడం... ప్రజలు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా తక్షణం మరమ్మతులు నిర్వహించాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశించినా కేవలం రోడ్డును తవ్వేసి పనులు నిర్వహించినట్టు ఆయన పేషీకి తప్పుడు సమాచారం ఇచ్చిన విషయంపై ఆంధ్రజ్యోతిలో ఇటు ప్రయాణం నరకం శీర్షికతో వార్తా కథనం ప్రచురితమైంది. రాళ్లు లెగిసిపోయి ఈ రోడ్డుపై ప్రయాణం ప్రజలకు ప్రత్యక్ష నరకాన్ని చూపిసున్నదని కథనం ద్వారా తెలియజెప్పడంతో అధికారుల్లో కదలిక వచ్చింది. తక్షణం పనులు పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని డిప్యూటీ సీఎం పేషీ నుంచి ఆర్అండ్‌బీ అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో వారిలో కదలిక వచ్చింది. శుక్రవారం రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ప్రస్తుతం తారురోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నాలుగు రోజుల వ్యవధిలో పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. పనులు ప్రారంభం కావడంపై చేబ్రోలు, ఏపీ, ఏకేమల్లవరం సహా ఎనిమిది గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

సామూహిక ఎలుకల నిర్మూలనతో సత్ఫలితాలు

జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్

పలుచోట్ల నివారణ మందు పంపిణీ



సామర్ల కోట మండలం అచ్చంపేటలో రైతులకు ప్యాకెట్లు అందజేస్తున్న డీఏవో

సామర్లకోట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 1.75 లక్షల ఫైబడి ఎకరాల్లో దాళ్వా వరిసాగు అయ్యిందని, వరిపంటలో 20 శాతం వరకూ పిలకలను ఎలుకలు కొరికివేయండతో పంట దిగుబడులు తగ్గుతున్నాయని ఇది గమనించిన ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సామూహిక ఎలుకల నిర్మూలన చేడుతుందని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.విజయకుమార్ పేర్కొన్నారు. సామర్లకోట మండలం అచ్చంపేట రైతు సేవా కేంద్రం ఆవరణలో మండలఎంఏవో ఐ.సత్య ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఏవో మాట్లాడుతూ ఎలుకలు ఉలి వంటి మంద పండ్లతో వస్తువులను సులభంగా కొరుకుతాయని, ఈ పండ్లు రోజుకు 0.4 మి.మీ. వంతున పెరుగుతాయన్నారు. ఇలా నిత్యం పెరుగుతూ పోతే ఆ దంతాలు కపాలాన్ని చీల్చుకుపోవడం జరిగి ఎలుక మరణిస్తుందన్నారు. రైతులందరూ ఒకే సమయంలో సమష్టిగా ఎలుకల నిర్మూలన చేపట్టాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల రైతు సేవాకేంద్రాలకు వ్యవసాయ శాఖ ద్వారా బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా పంపిణీ చేస్తున్నారన్నారు. దీంతో ఎలుకల నిర్మూలన సాధ్యపడి పంటనష్టం నుంచి రైతులు కొంతమేర ఉపశమనం పొందవచ్చని పేర్కొన్నారు. డీఏవో, ఎంఏవో బ్రోమోడయోలిన్ మందు ప్యాకెట్లను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో వీరంరెడ్డి పెదబాబు, పెద్దిరెడ్డి బాబ్జీ, యాళ్ళ కాశీవిశ్వనాథం, ముమ్మిడి శ్రీనివాసు, బుర్రా చక్రధర్, వింటి బాబ్జీ ఉన్నారు.

పెద్దాపురం/సామర్లకోట: పెద్దాపురం మండలంలోని అన్ని గ్రామాల రైతు సేవాకేంద్రాలలో శుక్రవారం జిల్లా వ్యవసాయా శాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాలు మండల వ్యవసాయాధికారులు, తదితర వ్యవసాయ సిబ్బందితో పెద్దఎత్తున నిర్వహించారు. ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న బ్రోమోడయోలిన్ మందుతో నూకలు, నూనెలతో కూడిన మందుమిశ్రమాన్ని తయారీ చేసుకునే విధానాలపై రైతులకు పెద్దాపురం ఏడీఏ ఎన్.దైవకుమార్ వివరించారు. పెద్దాపురం మండలం గోరింట గ్రామ రైతు సేవా కేంద్రం ఆవరణలో జరిగిన కార్యక్రమానికి మండల వ్యవసాయాధికారి సంజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా రైతులకు అందజేశారు. ఏఈవో ప్రసాద్, తదితర రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: సామూహిక నివారణ పద్ధతులు ఆచరించడం ద్వారా ఎలుకలను నిర్మూలించవచ్చని వ్యవసాయశాఖ జేడీ ఎస్ విజయ్‌కుమార్ కోరారు. కాకినాడ రూరల్ మండల పరిధిలోని 13 ఏరువాక కేంద్రాల్లో 22 కిలోల బ్రోమోడయాలోన్ మందును రైతులకు పంపిణీ చేశారు. ఎలుకల నివారణ కోసం ఆచరించాల్సిన నివారణ పద్ధతులు, ఎలుకల మందు తయారీ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏవో చీకట్ల సత్యనారాయణ, ఏఈవోలు సూర్యనారాయణ మూర్తి, పాల్ జోయ్ తదితరులు పాల్గొన్నారు.

కరప: ఎలుకల నిర్మూలనతోనే అధిక దిగుబడులు సాధ్యమని, రైతులు సమష్టిగా ఎలుకల నిర్మూలన చేపట్టాలని వ్యవసాయశాఖ కరప సహాయ సంచాలకులు కె.బాబూరావు సూచించారు. పెనుగుదురు సొసైటీ కార్యాలయం వద్ద ఎలుకల మందు పంపిణీలో ఆయన మాట్లాడారు. ఎరను రైతులకు అందజేసి, పొలాల్లోని ఎలుకల బొరియల వద్ద వాటిని పెట్టి సూచనలు చేశారు. మండలంలోని ఆయా రైతుసేవా కేంద్రాల్లో వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు ఉచితంగా ఎలుకల మందును పంపిణీ చేశారు. ఏవో అప్పసాని వెంకటరాజేష్, ఏఈవో బండారు శ్రీరాములు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు: సామూహిక ఎలుకల నిర్మూలనతో సత్ఫలితాలు లభిస్తాయని వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు పి.స్వాతి తెలిపారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తి సహా అన్ని గ్రామాలు, గొల్లప్రోలులో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు బ్రోమోడయోలోన్ తయారీ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సత్యనారాయణ తదితరులున్నారు.

డిజిటల్ అరెస్ట్ పేరుతో వీడియో కాల్

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ప్రతాప్‌నగర్‌కు చెందిన 70 ఏళ్ల పి.విశ్వనాదం విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి. అతను డిజిటల్ అరెస్ట్ పేరుతో సైబర్ మోసానికి గురై తృటిలో తప్పించుకున్నాడు. విశ్వనాదం బుధవారం తన ఇంటిలో ఉండగా ఓ అజ్ఞాత వ్యక్తి నుంచి వీడియో కాల్ వచ్చింది. కాల్ లిఫ్ట్ చేసిన ఆయనకు వీడియోలో ఓ వ్యక్తి కనిపించి మీరు డిజిటల్ అరెస్ట్ అయ్యారని బెదిరించాడు. దాంతో విశ్వనాదం కంగుతిన్నాడు. గతంలో ఒక్కసారి స్థానిక కర్ణంగారి సెంటర్‌లో టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సైబర్ నేరాలపై అవగాహనా సదస్సుకు విశ్వనాదం హాజరైన సందర్భాన్ని గుర్తు తెచ్చుకున్నాడు. ధైర్యాన్ని కూడగట్టుకుని ఎదిరించడం ప్రారంభించాడు. ఎవరు నువ్వు, ఎక్కడ నుంచి కాల్ చేస్తున్నావ్, ఎంత మందిని ఇలా మోసం చేస్తున్నావ్ అంటూ నిలదీశాడు. కంగుతిన్న సైబర్ నేరగాడు వెంటనే కాల్ కట్ చేసి ఉడాయించాడు. ఆ విషయాన్ని విశ్వనాదం కుటుంబ సభ్యులకు చెప్పి వారి సహకారంతో టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

గొల్లప్రోలు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో పారిశుధ్యాన్ని మెరుగుపరిచే దిశగా శుక్రవారం నుంచి శానిటేషన్ స్పెషల్‌డ్రైవ్ చేపట్టారు. మండలపరిషత్ కార్యాలయం, పీహెచ్‌సీ సమీపంలో ప్రస్తుతం డంపింగ్‌యార్డులో చెత్తను వేయడం నిలిపివేశారు. ఇప్పటికే అక్కడ ఉన్న చెత్తాచెదారాన్ని పిఠాపురంలోని డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. పట్టణంలోని రాయవరం రోడ్డులో గల డ్రెయిన్లల్లో పూడిక తొలగింపును ప్రారంభించారు. పనులను కమిషనరు నామా కనకారావు, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రఘు పర్యవేక్షించారు.

పొన్నాడలో బంగారుపాప ఉరుస్ ఉత్సవాలు ప్రారంభం

కొత్తపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పొన్నాడలో బషీర్‌బీబీ ఔలియా 70వ బంగారుపాప ఉరుస్ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జనసేన పార్టీ పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ బంగారు పాప దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా దర్గా ముజావర్లు బంగారుపాప ఆలయ విశిష్టత, ఆమె చరిత్రను మర్రెడ్డికి తెలియజేశారు. పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు బంగారు పాప దర్శనం చేసుకున్నారు.



ఉత్సవాలు ప్రారంభించిన ముజావర్లు


కంప్రెస్ట్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు స్థలాలను గుర్తించాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కంప్రెస్ట్ బయోగ్యాస్ (శుద్ధి చేసిన వ్యర్థాల నుంచి తయారైన గ్యాస్)ప్లాంట్ ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌తోపాటు జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనాతో కలిసి జిల్లాలో కంప్రెస్ట్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ఇంటి గ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ కింద జీవ ఇంధన ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలను తీసుకువచ్చిందన్నారు. ఇంటిగ్రేటెడ్ కంప్రెస్ట్ బయోగ్యాస్ ప్లాంటును రిలయన్స్ సంస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకున్నదన్నారు. ఈ కంప్రెస్ట్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు ఐదేళ్లపాటు సుస్థిర మూలధనం పెట్టుబడిపై 20శాతం, స్టేట్ జీఎస్టీ పూర్తిరియంబర్స్‌మెంట్, ఐదేళ్లపాటు విద్యుత్ రాయితీ ఇవ్వనున్నదన్నారు. సాంప్రదాయ వనరులపై ఆధారపడడం తగ్గించడంతోపాటు వ్యర్థాలను శక్తిగా మార్చడం ద్వారా ఆర్థిక వ్యవస్థకు దోహదపడుతుందనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టులు ఏర్పాటు చేయనున్నాదన్నారు. ఈ ప్లాంటుకు అనువైన భూములను గుర్తించాలన్నారు. ప్రధానంగా అటవీ, అసైన్డ్ భూముల వివరాలు సేకరించి నివేదిక సమర్పించాలన్నారు. కార్యక్రమంలో కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి ఇతర అధికారులు పాల్గొన్నారు.

'ఏకాగ్రతతో చదవాలి'



గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీవైఈవో

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఏకాగ్రతతో చదవాలని డీవైఈవో నాయుడు వెంకటేశ్వరరావు సూచించారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థుల ఫిజికల్‌సైన్స్ సామర్థ్యాన్ని పరిశీలించారు. ప్రతి సబ్జక్టులో ఎక్కడ మనకు అవగాహన తక్కువ ఉందో గుర్తుంచుకుని దానిపై దృష్టి పెట్టి అధిగమించాలని తెలిపారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



కాకినాడ అర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అంత రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు క్రీడాకారులకు శుక్రవారం జిల్లా క్రీడా మైదానంలో సానా సతీష్ ఫౌండేషన్ ఛైర్మన్ తలాటం హరీష్ స్పోర్ట్స్ దుస్తులను పంపిణీ చేశారు. ఈనెల 8,9 తేదీల్లో వరంగల్‌లో జరిగే పోటీల్లో పాల్గొనే జట్టుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సిటీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నాయకుడు దొంతమూరి అశోక్ తదితరులు ఉన్నారు.

రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా కిషోర్

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా వలసపాకలకు చెందిన సూరంపూడి కిషోర్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం వలసపాకలలో నిర్వహించిన రేషన్ డీలర్ల సర్వసభ్య సమావేశంలో నూతన పాలకవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం మాజీ అధ్యక్షుడు కోటిపల్లి శ్రీను ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే పంతం నానాజీని కలిశారు.

రేపటి నుంచి వార్షిక జ్ఞానచైతన్య మహాసభలు

పిఠాపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణ శివారులోని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో ఈనెల 9,10,11వ తేదీల్లో పీఠం వార్షిక జ్ఞాన చైతన్య మహాసభలు నిర్వహిస్తున్నట్టు పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు తెలిపారు. పట్టణ శివారులోని ఆశ్రమ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ మహాసభలకు దేశ, విదేశాలు నుంచి 36వేలమంది సభ్యులు హాజరవుతారని చెప్పారు. మానవత్వమే మతం, ఈశ్వర తత్వమని చాటుతూ మతాతీత ఆధునిక మానవతా దేవాలయంగా పీఠం వెలుగొందుతుందని తెలిపారు. 1472లో స్థాపించిన ఈ పీఠం 553 ఏళ్లుగా ఆర్ష సూఫీ వేదాంత సారాన్ని ఏకత్వ రూపంగా బోధిస్తుందన్నారు. మహాసభల్లో పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా భక్తులనుద్దేశించి 3 రోజులు అనుగ్రహభాషణ చేయడంతో పాటు మహామంత్రాన్ని ఉపదేశిస్తారని తెలిపారు. సమావేశంలో పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా, పీఠం సెంట్రల్ కమిటీ సభ్యులు వర్మ, పింగళి ఆనందకుమార్, ఏవీవీ సత్యనారాయణ, ఆకుల రవితేజ పాల్గొన్నారు.

రేపు తాటిపర్తిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు జనసేన నాయకుడు మొగలి నరసింహమూర్తి తెలిపారు. గ్రామంలోని బత్తుల మురళీకృష్ణ ఫంక్షన్‌హాలులో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరిగే ఈ శిబిరంలో కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు సిబ్బంది పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. తాటిపర్తి, వన్నెపూడి, చినజగ్గంపేట, కొడవలి, చెందుర్తి గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నేటి నుంచి వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు

గొల్లప్రోలు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులోని రైల్వేస్టేషన్ వద్ద వేంచేసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవాలు శనివారం నుంచి ప్రారంభంకానున్నాయి. 8వ తేదీ ఉదయం స్వామి, అమ్మవార్ల రథోత్సవం, రాత్రికి కల్యాణం, 12వ తేదీ వరకూ విశేష పూజలు, ఆ రోజు రాత్రి శ్రీపుష్పయాగం, ఊయల సేవ జరుగుతాయి. 13వ తేదీన ఆలయం వద్ద మహా అన్నదానం నిర్వహిస్తారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.

నేడు జమ్మి గంగాలమ్మ తల్లి పంచమ వార్షికోత్సవం

గొల్లప్రోలు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు టోల్‌ప్లాజా సమీపంలో కొలువైన జమ్మి గంగాలమ్మ తల్లి పంచమ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నారు. ఉదయం వార్షిక సంకల్పం, వినాయక పూజ, పుణ్యాహవచనములు, అమ్మవారి ఆరాధన, సహస్ర నామార్చన, లలితాహోమం, మహాపూర్ణాహుతి జరుగుతాయి. మహాయాగం, అనంతరం అన్నదానం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు స్పష్టం చేశారు.

'జూదాల నిర్వహణకు అనుమతులు లేవు'

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం కొవ్వూరులో శనివారం నిర్వహించే వేంకటేశ్వరస్వామి ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలని ఏవిధమైన అసాంఘిక నృత్యాలు, జూదాలు నిర్వహించేందుకు అనుమతులు లేవని ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ ఆలయ కమిటీకి సూచించారు. ఉత్సవాల ఏర్పాట్లను సీఐ సీహెచ్.చైతన్యకృష్ణ, ట్రైనీ డీఎస్పీ జీవన, ఎస్ఐ ఎం.వీరబాబులతో కలిసి పరిశీలించి కమిటీకి పలు సూచనలు చేశారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జగన్నాధపురం అంకాడి వారి వీధికి చెందిన మురమళ్ళ సాయిబాబా (80) అనే వృద్ధురాలి మెడ నుంచి అగంతుకుడు గొలుసు లాక్కెళ్ళిన సంఘటన శుక్రవారం జరిగింది. సాయిబాబా శుక్రవారం ఉదయం పూజ చేసుకునేందుకు ఇంటి ప్రాంగణంలో ఉన్న పూల చెట్టు నుంచి పూలు కోస్తుండగా ఓ అగంతుకుడు ద్విచక్రవాహనం పై వేగంగా వచ్చి ఆమె మెడలో ఉన్న 2 కాసుల బంగారు గొలుసును తెంపుకుని పరారయ్యాడు. ఆమె వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్వాడీ కేంద్రం పరిశీలన

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతులూరు అంగన్వాడీ కేంద్రాన్ని ప్రత్తిపాడు సీడీపీవో పద్మ శుక్రవారం పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. చిన్నారుల్లో పోషకాహార లోపాలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు హిమోగ్లోబిన్ తగ్గకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. క్రమం తప్పకుడా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కేంద్రానికి సరఫరా అవుతున్న గుడ్ల నాణ్యత, పరిమాణాన్ని పరిశీలించారు. సూపర్‌వైజర్ వరలక్ష్మి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈవో వెంకటేశ్వర్లు

ఇష్టపడి చదివితే సత్ఫలితం: ఎంఈవో

చింతూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టపడి చదివితే సత్ఫలితాలు కష్టమేమీ కాదని ఎంఈవో జి.వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. ప్రణాళికాబద్ధంగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డివిజన్, జిల్లా స్థాయిల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి విద్యా శాఖ తరఫున ప్రత్యేక బహుమతులు ఇస్తామని ఎంఈవో చెప్పారు.

గర్భస్థ లింగ నిర్ధారణ చేస్తే క్రిమినల్ కేసులు

రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ



రంపచోడవరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో గర్భిణులకు ప్రసవాలకు ముందు లింగ నిర్ధారణ చేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సబ్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ అన్నారు. శుక్రవారం ఆమె లింగ నిర్ధారణ నిర్మూలన కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో గర్భిణులకు లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. లింగ నిర్ధారణ చర్యలకు పాల్పడితే టోల్‌ఫ్రీ నెంబరు 18004253365కు సమాచారం ఇవ్వాలన్నారు. ఏజెన్సీలో బాల్య వివాహాలను నిర్మూలించే బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిబంధనల ప్రకారం సమావేశాలు నిర్వహించాలన్నారు. మెడికల్ షాపుల్లో తనిఖీలు నిర్వహించి మందులు, లైసెన్సులను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీపీ పి.రవీంద్రమోహన్, ఎస్ఐ వెంకటరావు, సీడీపీవో సంధ్యారాణి, ఎంపీహెచ్‌వో పీటర్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పల్లాల అరుణకుమారి, కోసూరి లోవశ్రీ, హెల్త్ సూపర్‌వైజర్ సీత, ఫార్మసీ అధికారి బి.మార్గదర్శి, ఆరోగ్య విస్తరణాధికారి వై.లవకుశ పాల్గొన్నారు.

మన్యంకొండ జాతర ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష



సమావేశానికి హాజరైన ఆంధ్ర అధికారులు

మోతుగూడెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 3న జరిగే మన్యంకొండ జాతర ఏర్పాట్లపై శుక్రవారం ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ అశిష్ ఈశ్వర్ పటేల్ ఆంధ్ర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి జాతరకు సుమారు 25వేల నుంచి 30వేల మంది వస్తారన్నారు. భక్తులు సీలేరు నది దాటి పొల్లూరు జలపాతం వద్ద జాతర జరిగే ప్రదేశానికి ఎలా వెళ్లాలో అధికారులను అడిగి తెలుసుకున్నారు. జాతరలో భద్రతా ఏర్పాట్ల గురించి చింతూరు సీఐ తెల్లం దుర్గాప్రసాద్‌ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. శానిటేషన్, మెడికల్, మంచినీరు, భోజనాల గురించి మోతుగూడెం పంచాయతీ కార్యదర్శి జి.మోహన్‌ని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఒడిశా సబ్ కలెక్టర్ ధనరాజ్ యాదవ్ బోయ, అడిషనల్ ఎస్పీ తుఫాన్ నారాయణ రహత్, చింతూరు తహసీల్దారు చిరంజీవి, సీఐ తెల్లం దుర్గాప్రసాద్, లక్కవరం రేంజర్ నానాజీ, లోయర్ సీలేరు ఏపీ జెన్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్ పాల్గొన్నారు.

మావోయిస్టుల సమాచారం ఇవ్వండి: నజరానా పొందండి



ఏడుగురాళ్లపల్లి వారపు సంతలో మావోయిస్టుల చిత్రపటాలను చూపిస్తున్న ఎస్ఐ రమేష్

చింతూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల సమాచారం ఇచ్చిన వారికి నజరానా ఇస్తామని ఎస్ఐ పి.రమేష్ వెల్లడించారు. ఏడుగురాళ్లపల్లి వారాంతపు సంతలో శుక్రవారం ఆయన తన బృందంతో పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మావోయిస్టుల చిత్రాలను ప్రదర్శించి ప్రజలకు పరిచయం చేశారు. మావోయిస్టు యాక్షన్ టీమ్‌కు చెందిన వారి పేర్లు, వివరాలతో కూడిన కరపత్రాలను పంచారు. అనంతరం వారితో ఎస్ఐ మాట్లాడుతూ మావోయిస్టుల సమాచారాన్ని పోలీసు ఉన్నతాధికారులకు అందించిన వారికి రూ.లక్ష నుంచి పది లక్షల వరకు నజరానా ఇస్తామన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మన్యం బంద్‌కు గిరిజన సంఘం సంపూర్ణ మద్దతు



గొంటువానిపాలెంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు సీసం సురేష్

చింతూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): స్పీకర్ అనుచిత వ్యాఖ్యలను గిరిజన సంఘం తీవ్రంగా ఖండిస్తోందని గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు సీసం సురేష్ అన్నారు. శుక్రవారం చింతూరులో ఏర్పాటుచేసిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదివాసీ సంఘాలు ఈ నెల 12న చేపట్టనున్న రాష్ట్రవ్యాప్త మన్యం బంద్‌కు గిరిజన సంఘం పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తుందన్నారు. ఆదివాసీలకు రక్షణగా ఉన్న చట్టాలను మార్చాలని స్పీకర్ అనడం విడ్డూరమన్నారు. సీఎం చంద్రబాబు ప్రభుత్వ వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మొట్టుం రాజయ్య, సోడె లెనిన్, కారం సుబ్బారావు, పాంగ్రుం నాగార్జున, పాంగ్రుం సుబ్బారావు, బీరబోయిన దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ ప్రాంతంలోని ఆదివాసీలకు రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన హక్కులు, చట్టాల పరిరక్షణ కోసం ఈ నెల 11, 12 తేదీల్లో తలపెట్టిన 48 గంటల రాష్ట్రవ్యాప్త మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన ఆదివాసీ నాయకులు కారం రామన్న దొర, యలగాడ నాగేశ్వరరావులతో కలిసి మీడియాతో మాట్లాడారు.

స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలకు ఖండన

రంపచోడవరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా ఆదివాసీలు వీరోచిత పోరాటాలు చేసి త్యాగాలతో సాధించుకున్న 1/70 చట్టంపై శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు చేసిన వ్యాఖ్యలను అఖిల భారత రైతుకూలీ సంఘం నాయకుడు పల్లాల లచ్చిరెడ్డి ఖండించారు. ఆదివాసీల భూములు, ఆస్తులకు రక్షణగా ఉన్న చట్టాన్ని పెట్టుబడిదారులకు అనుకూలంగా సవరించాలన్న ఆలోచనను తక్షణం విరమించుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ చట్టాలకు తూట్లు పొడిచి వారి హక్కులను హరించి వేస్తున్నాయన్నారు. ఆదివాసీలు హక్కులపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

గొంటువానిపాలెంలో తాటాకిల్లు దగ్ధం

అడ్డతీగల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొంటువానిపాలెంలో దూది వరలక్ష్మి తాటాకిల్లు శుక్రవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ఆదేశాలతో టీడీపీ మండల శాఖ మాజీ అధ్యక్షుడు అడారి నాగబాబు కార్యకర్తలతో కలిసి కట్టుబట్టలతో రోడ్డున పడ్డ ఒంటరి మహిళ ఇంటికి వెళ్లారు. తక్షణ సాయంగా నిత్యావసర వస్తువులు, కూరగాయలు, దుస్తులు కొంత నగదు అందజేశారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ఏవీ నగరంలో వెంకన్న బ్రహ్మోత్సవాలకు శ్రీకారం



హోమ గుండంలో హవిస్సులు అర్పిస్తున్న యనమల దంపతులు, ఎమ్మెల్యే దివ్య దంపతులు

తొండంగి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఏవీ నగరంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవ ంగా ప్రారంభమయ్యాయి. వివిధ పుష్పమాలికలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన ఆలయ ప్రాంగణంలో అర్చకులు వేదమంత్రోచ్ఛారణలతో పూజా క్రతువుకు శ్రీకారం చుట్టారు. తొలుత ఆలయ ప్రాంగణంలోని షిర్డీ సాయినాథుని ఆలయంలో తెల్లవారుజామున కాకడ హారతితో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి, గణపతి పూజ నిర్వహించి బాబాకు పంచామృతాభిషేకం జరిపారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు-విజయలక్ష్మి దంపతులు, ఎమ్మెల్యే యనమల దివ్య-గోపీనాథ్ దంపతులు అభిషేక సేవలో పాల్గొన్నారు. అనంతరం అలంకరణ, అర్చన జరిపారు. విశేషంగా హాజరైన భక్తులతో సాయి సత్య వ్రతాలు నిర్వహించారు. మధ్యాహ్న హారతి అనంతరం సాయంత్రం పల్లకీ సేవ జరిపారు.

వైభవంగా అంకురారోపణ, ధ్వజారోహణ: శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా యజమాన దంపతులైన యనమల రామకృష్ణుడు-విజయలక్ష్మి దంపతులతో ముందుగా విఘ్నేశ్వర పూజ, దీక్షాధారణ, అంకురారోపణ, ధ్వజారోహణ చేయించారు. విశేష మండపారాధన, అష్టోత్తర శత కలశ పూజ నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులు సాయిబాబాను, వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ తదితరులు స్వామిని దర్శించుకున్నారు



భోజనాలు చేస్తున్న గుమ్మరేగుల గ్రామస్తులు

రాజులబాబు పండుగ

రౌతులపూడి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మరేగులలో అడివి రాజులుబాబు పండుగను ప్రజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులంతా గ్రామ శివారులో వున్న రాజులు బాబు లంక వద్దకు చేరుకుని విగ్రహానికి పూజలు చేశారు. పౌర్ణమి ముందు మొదటి శుక్రవారం చేయడం ఇలా గ్రామస్తులకు చాలా కాలంగా అనవాయితీగా వస్తోంది. తోటల్లోనే వంటలు వండుకుని కుటుంబ సభ్యులతో కలిసి భోజనాలు చేశారు.



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం

రాచపల్లి పీహెచ్‌సీ వద్ద ఐవోసీఎల్ మాక్ డ్రిల్

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి వద్ద ఐవోసీఎల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయిల్ సరఫరా పటిష్టతపై మాక్ డ్రిల్ నిర్వహించారు. అత్యవసర పరిస్థితులు, అనుమానాస్పద కార్యకలాపాలతో పాటు పైపులైన్ ప్రాముఖ్యత, భద్రత, సంసిద్ధత సంబంధిత అంశాలపై అవగాహన కోసం ఈ మాక్‌డ్రిల్ నిర్వహించినట్టు ఐవోసీఎల్ అధికారులు సుబ్రహ్మణ్యం, హనుమంతు రావు, సీతారాం, కాకినాడ డీపీఐఎఫ్ రాధాకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మంత్రి సవితకు జ్ఞాపిక అందజేస్తున్న రాజేష్

'ఆర్యవైశ్యులకు రుణాలందించి ఆదుకోవాలి'

జగ్గంపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ల రుణాలతో పాటు అర్హులైన ఆర్యవైశ్య కుటుంబాలకు రుణాలు అందజేయాలని మంత్రి ఎస్.సవితకు రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డిండి రాజేష్, డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) వినతిపత్రం అందజేశారు. లబ్ధిదారుల వినతులను దృష్టిలో పెట్టుకుని బీసీ, ఈడబ్ల్యుఎస్, కాపు, ఆర్యవైశ్య సహా వివిధ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో మంజూరు చేస్తున్న యూనిట్లకు దరఖాస్తు గడువును ఈ నెల 12 వరకు పెంచుతున్నట్టు ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్.సత్యనారాయణ, జీఎం భీమశంకర్, మేనేజింగ్ డైరెక్టర్ మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఏవీ నగరంలో ప్రచారం చేస్తున్న అభ్యర్థి రాజశేఖర్, ఎమ్మెల్యే దివ్య

ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల ఇంటింటి ప్రచారం

తొండంగి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ శుక్రవారం ఏవీ నగరంలో ఎమ్మెల్యే యనమల దివ్యతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఎమ్మెల్యే దివ్య మాట్లాడుతూ రాజశేఖర్ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయ్యాలన్నారు. రాజశేఖర్ మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, తనను అధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కరపత్రాలు పంచి ఓట్లు అభ్యర్థించారు. ఆయన వెంట కొయ్యా శ్రీనుబాబు, యనమల రాజేష్, యనమల భాస్కర్, కొయ్యా రామకేశవ, అరిగెల నర్సింహమూర్తి, మాజీ ఎంపీపీ యనమల కృష్ణ తదితరులు ఉన్నారు.

కిర్లంపూడి (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని కోరుతూ పెందుర్తి మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ శుక్రవారం జగపతినగరంలో టీడీపీ బూత్ ఇన్‌చార్జి కాళ్ల వెంకటేష్, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు చదరం చంటిబాబు ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. సర్పంచ్, జిల్లా అభివృద్ధి కమిటీ సభ్యురాలు గుడాల శ్రీలత రాంబాబు, ఎంపీటీసీ ఆళ్ల నానాజీ, నూరిశెట్టి వెంకటశివ, ఆళ్ల బాబులు పాల్గొన్నారు.



లక్ష పసుపు కొమ్ముల నోము నోచుకుంటున్న మహిళలు

ప్రత్తిపాడులో లక్ష పసుపు కొమ్ముల నోము

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముదునూరి మురళీరాజు గెస్ట్‌హౌస్ వద్ద శుక్రవారం లక్ష పసుపు కొమ్ముల నోము, గరిస ధాన్యం పూజలను ధర్మవరానికి చెందిన చెందిన జయపూరి రాంబాబురాజు, ప్రసాదరాజు సోదరులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు, దొడ్డిపట్ల కృష్ణ, బొల్లు నాగేశ్వరరావు, చేపూరి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పాత సంచుల వర్తక సంఘం నూతన కార్యవర్గం



ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

తుని రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తుని పాత సంచుల వర్తక సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం అట్టహాసంగా జరిగింది. అధ్యక్షుడిగా గుణపర్తి కృష్ణ, ఉపాధ్యక్షుడిగా వంగలపూడి మహేష్, కార్యదర్శిగా బొడ్డ శివగణేష్, సహాయ కార్యదర్శిగా చోడిశెట్టి శ్రీనివాసరావు, కోశాధికారిగా వీర్ల ఈశ్వరరావు, సహాయ కోశాధికారిగా మిరియాల రామకృష్ణలను ఎన్నుకున్నారు. వారితో మాజీ అధ్యక్షులు నకురు నాగేంద్రనెహ్రూ, నరిసే శివాజీ ప్రమాణం చేయించారు. నూతన కార్యవర్గ సభ్యులను పట్టణ ప్రముఖులతో పాటు వర్తక సంఘ సభ్యులు అభినందనలతో ముంచెత్తారు.

రోడ్డు నిర్మాణానికి రూ.50వేలు సాయం

దేవీపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరుపేట నుంచి మైదాన ప్రాంతమైన గోపాలపురం గ్రామానికి మూడు కిలోమీటర్లు గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, భారతీయ జనతా పార్టీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు రూ.50వేలు ఆర్థిక సాయం అందించారు. మున్ముందు ఏ అవసరం ఉన్నా సహకారం అందిస్తానని ఆయన భరోసా ఇచ్చారు. రోడ్డు పనులు మొదలవ్వడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు మామిడి అయ్యప్ప, ఇనకోటి బాపన్నదొర, వరసాల ప్రసాద్, డాక్టర్ వల్లూరి జగన్నాథరావుశర్మ, కట్టా కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిని మెరుగుపరచాలి

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధిని మెరుగుపరచాలని డివిజనల్ పంచాయతీ అధికారి కె.నర్సింగరావు కోరారు. మండలంలోని చెరుకుకొమ్ము పాలెం, జడ్డంగి, అమీనాబాద్, దూసరిపాము, రాజవొమ్మంగి పంచాయతీలను ఆయన శుక్రవారం పరిశీలించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను తనిఖీ చేశారు. వాటిని వాడుకలోకి తెచ్చి వర్మీకంపోస్టు తయారుచేసి వాటి నుంచి వచ్చిన సంపద ద్వారా క్లాప్‌మిత్రలకు జీతాలు ఇవ్వాలన్నారు. విస్తరణాధికారి కె.కోటేశ్వరరావు, డివిజనల్ పంచాయతీ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ చవలం తమ్మన్నదొర, కంప్యూటర్ ఆపరేటర్ కె.మనోహర్ పాల్గొన్నారు.

గండిపోశమ్మకు పంచామృతాలతో అభిషేకం

దేవీపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధిగాంచిన గండిపోశమ్మ అమ్మవారికి శుక్రవారం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం జరిపారు. భక్తులు భారీగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



నూతన వధూవరులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

నెహ్రూ ఫౌండేషన్ ద్వారా పెళ్లి కానుక

జగ్గంపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రావులమ్మ నగర్‌లోని జ్యోతుల నవీన్ ఇంటి వద్ద జగ్గంపేటకు చెందిన మట్టపల్లి కృష్ణార్జున కుమార్తె కృష్ణలక్ష్మి వసుమతి-కిరణ్ నూతన దంపతులకు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా రూ.20వేలు పెళ్లి కానుకను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, దేవరపల్లి మూర్తి, వేములకొండ జోగారావు, నండ్ల చిరంజీవి, బొండాడ జగన్, గద్దె మారుతి పాల్గొన్నారు.



ఆంజనేయ స్వామిని పల్లకీలో ఊరేగిస్తున్న గ్రామస్తులు

ఆంజనేయస్వామికి గ్రామోత్సవం

కిర్లంపూడి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బూరుగుపూడిలో అభయాంజనేయస్వామి 39వ వార్షికోత్సవాల్లో భాగంగా ఆలయ ధర్మకర్త, ఉత్సవ కమిటీ చైర్మన్ కర్నాకుల పెద్దకాపు ఆధ్వర్యంలో శుక్రవారం స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులు హారతులు ఇచ్చారు. కమిటీ సభ్యులు మరియాల వెంకటేశ్వర్లు, బెల్లంకొండ గోవిందస్వామి, కర్నాకుల వెంకటసూరిబాబు, కర్రి వీరవెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న శక్తి వేషాలు

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

గండేపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేపల్లిలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. అర్చకుడు నాగేశ్వరరావు ఉదయం నుంచీ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోలాట నృత్యాలు, శక్తివేషాలు, బాజాభజంత్రీలు, బాణసంచా నడుమ స్వామివారిని గ్రామంలో ఊరేగించగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ఉచిత వైద్య శిబిరం

గండేపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వెంకటాపురం గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవిశంకర్ తెలిపారు. కాకినాడ మెడికవర్ హాస్పిటల్ డాక్టర్ వినోద్, యాక్టివిటీస్ మేనేజర్ అభిలాష్, నర్సింగ్ స్టాఫ్ అవసరమైన వారికి ఈసీజీ, షుగర్, రక్తపరీక్షలను ఉచితంగా నిర్వహించారు. సుమారు 250 మందిని పరీక్షించి ఐరన్ టాబ్లెట్లు, మల్టీవిటమిన్, జ్వరం, ఒళ్లు నొప్పులు, జలుబు మందులు పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ పి.ప్రశాంతి, ఎస్.శృతి, బి.రేణుక, వలంటీర్లు, ప్రెసిడెంట్ ముంగి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

వరి కుప్ప దగ్ధం

జగ్గంపేట రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటకు చెందిన గొర్రెల వెంకటరమణ వరి కుప్ప శుక్రవారం దగ్ధమైంది. సిగరెట్‌ను నిర్లక్ష్యంగా పడేయడంతో సుమారు ఎకరం వరి కుప్ప దగ్ధమైందని, రూ.50వేలు నష్టం సంభవించిందని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు.